ప్రజాశక్తి

గురువారం 25 జనవరి 2024 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



నీటి విడుదల కోసం స్విచ్ ఆన్ చేస్తున్న మంత్రి నాగార్జున

రైతులకు అండగా ప్రభుత్వం

- మంత్రి మేరుగ నాగార్జున
- గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎడమ కాలువకు నీరు విడుదల

ప్రజాశక్తి-మద్దిపాడు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తున్నట్లు మంత్రి, వైసిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి మంత్రి మేరుగ నాగార్జున తెలిపారు. మండల పరిధిలోని మల్లవరం కందుల ఓబుల్ రెడ్డి జలాశయం ఎడమ కాలువకు బుధవారం సాగునీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతుల అభ్యర్థన మేరకు ఒక తడికి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. పంటల కోసం 40 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

రైతు, కౌలు రైతు సంఘాల నాయకుల చొరవ..

రైతు, కౌలు రైతు సంఘాలు నాయకులు చొరవ తీసుకొని రైతులకు కనీసం ఒక తడికైనా నీరు ఇవ్వాలని కలెక్టర్, మంత్రి మేరుగు నాగార్జునను కోరారు. వారు స్పందించి సాగునీరు విడుదల చేశారు. మద్దిపాడు, నాగులుప్పలపాడు మండలాల రైతులకు ఈ నీరు ఎంతగానో ఉపయోగ పడుతుందని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైస్ ఎంపిపి, మల్లవరం సర్పంచి నారా వెంకటసుబ్బారెడ్డి, దొడ్డవరపాడు సర్పంచి శ్రీరామమూర్తి, వైసిపి నాయకులు పుల్లారావు, అన్వేష్, గుండ్లపల్లి ఎంపిటిసి పద్మ, నాగులప్పలపాడు వైసిపి నాయకుడు కృష్ణారెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

చీరాల నుంచి పోటీకి ఆమంచి సన్నద్ధం

- పర్చూరు నుంచి పోటీ చేయాలని వైసిపి అధిష్టానం సూచన
- నేడు స్వాములు పాదయాత్ర

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

రానున్న ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ సన్నద్ధమవుతున్నారు. అందులో భాగంగా పొట్టి సుబ్బయ్య పాలెం వద్ద ఉన్న క్రిస్టల్ రొయ్యల కంపెనీ ఆవరణలో చీరాల నియోజకవర్గ పరిధిలోని ముఖ్య అనుచరులతో మంగళవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమంచి తాను చీరాలలోనే పోటీ చేస్తానని, విషయం నియోజకవర్గ ప్రజలకు తెలియజేసే పని చేయాలని అనుచురులకు సూచించారు. తాను ఏ పార్టీ తరపున పోటీ చేస్తున్న విషయం త్వరలోనే వెల్లడవుతుందని తన అనుచరులకు ఆమంచి చెప్పినట్లుగా తెలిసింది.



చీరాలలో ఇటీవల నిర్వహించిన సామాజిక సాధికార యాత్ర సభలో పాల్గొన్న మంత్రి మేరుగ నాగార్జున, ఎంపీలు మోపిదేవి వెంకటరమణ, నందిగం సురేష్ వైసిపి చీరాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి కరణం వెంకటేష్ రానున్న ఎన్నికల్లో చీరాల నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు ఆమంచి తాడేపల్లి వెళ్ళి వైసిపి అధిష్టానం పెద్దలతో కలిసి తాను చీరాల నుంచే పోటీ చేస్తానని చెప్పినట్లు తెలిసింది. చీరాల నుంచి కరణం వెంకటేష్ పోటీ చేస్తారని,పర్చూరు నుంచి పోటీ చేయాలని పార్టీ పెద్దలు ఆమంచికి సూచించినట్లు తెలిసింది. తనను పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా నియమించిన సమయంలో చీరాల నుంచి బీసీ అభ్యర్థిని పోటీలో నిలుపుతామని చెప్పారని ఇప్పుడు ఒసి సామాజిక వర్గానికి చెందిన కరణం వెంకటేష్‌కు అవకాశం కల్పిస్తున్నందును తనకే అవకాశం ఇవ్వాలని ఆమంచి కోరినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై పార్టీ అధిష్టానం సానుకూలంగా లేక పోవడంతో చీరాల నుంచే పోటీకి ఆమంచి సన్నద్ధం అవుతున్నట్లు తెలుస్తుంది. చీరాలలో కరణం వెంకటేష్ పోటీ చేస్తున్నట్లు ఇటీవల నిర్వహించిన సభలో పార్టీ నేతలు ప్రకటించిన తర్వాత ఆమంచి అనుచరులుగా ఉన్న వారిలో కొందరు కరణం వెంకటేష్‌తో భేటీ అయినట్లు తెలిసింది. ఇలాగే వదిలేస్తే తన అనుచరులు జారీ పోతారన్న ఆలోచనతో వారిని కట్టడి చేసేందుకు హూటాహుటిన ఆమంచి సమావేశం ఏర్పాటు చేసి తాను చీరాల నుంచి పోటీ చేయనున్నట్లు వారికి చెప్పినట్లుగా సమాచారం. చీరాల నుంచి వైసిపి అభ్యర్థిగానే పోటీ చేసేందుకు ఆమంచి ప్రయత్నిస్తారని, అది కుదరక పోతే జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిగా లేక కాంగ్రెస్ తరపున ఆమంచి ఎన్నికల బరిలో నిలుస్తారని అనుచరులు చెబుతున్నారు.

నేడు ఆమంచి స్వాములు పాదయాత్ర..

జనసేన పార్టీలో చేరిన ఆమంచి శ్రీనివాసరావు అలియాస్ స్వాములు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. గిద్దలూరు నుంచి పోటీ చేసేందుకు తన వంతు ప్రయత్నాలు చేశారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో దర్శి స్థానాన్ని జనసేనకు కేటాయించినందున గిద్దలూరు నుంచి పోటీ చేసే అవకాశం లేకుండా పోయింది. దీంతో చీరాల నుంచి టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో పందిళ్ళపల్లి నుంచి దేశాయిపేట లోని జనసేన పార్టీ కార్యాలయం వరకూ గురువారం ఆయన పాదయాత్ర చేయన న్నారు. పాదయాత్రలో భాగంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోనున్నట్లు స్వాములు చెప్పారు. ఆమంచి సోదరులు చీరాల నుంచి పోటీ చేసేందుకు సన్నద్ధమవుతున్న నేపథ్యంలో ఇక్కడ రాజకీయం వేడెక్కనుంది.

గ్రానైట్ క్వారీలో తనిఖీలు

- బాచిన కృష్ణచైతన్య పార్టీ మారుతారని జోరుగా ప్రచారం
- కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే దాడులు అంటుతున్న అనుచరులు

ప్రజాశక్తి -బల్లికురవ రూరల్

వైసిపి అద్దంకి నియోజక వర్గ మాజీ ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్యకు సంబంధించిన గ్రానైట్ క్వారీలో మైనింగ్ అధికారులు బుధవారం ఆకస్మికంగా దాడులు చేశారు. ఈ దాడులపై ప్రజలు పెద్దఎత్తున చర్చించుకున్నారు. కృష్ణచైతన్యను రెండు నెలల క్రితం వైసిపి ఇన్‌ఛార్జి బాధ్యతల నుంచి తప్పించారు. ఆయన స్థానంలో పానెం హనీమిరెడ్డి వైసిపి అధిష్టానం ఇన్‌ఛార్జి నియమించింది. దీంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పుట్టినరోజు ఎవరికి వారే పోటా పోటీగా నిర్వహించారు. నూతన సంవత్సర వేడుకలు బాచిన కష్ణ చైతన్య తన ఇంటి వద్ద నిర్వహించుకున్నాడు. అద్దంకిలోని వైసిపి కార్యాలయంలో పానెం హనీమిరెడ్డి నిర్వహించారు. ఇటీవల కృష్ణచైతన్య, హనిమిరెడ్డికి సిఎంఒ కార్యాలయం నుంచి పిలుపు వచ్చింది. పార్టీ విజయానికి కృషి చేయాలని పార్టీ పెద్దలు కృష్ణ చైతన్యకు సూచించారు. అప్పటి నుంచి కష్ణచైతన్య, ఆయన అనుచరులు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. గత రెండు, మూడు రోజులుగా కష్ణ చైతన్య పార్టీ మారుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. దీంతో బల్లికురవ మండలంలోని మల్లాయపాలెం గ్రామంలో ఉన్న కృష్ణచైతన్యకు సంబంధించిన క్వారీలో మైనింగ్ అధికారులు దాడులు నిర్వహించారు. కృష్ణచైతన్యపై కక్ష సాధింపు చర్యలో భాగంగా ఈ దాడులు నిర్వహించినట్లు ఆయన అనుచరులు చెబుతున్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా కృష్ణచైతన్య పార్టీ కోసం కృషి చేసినట్లు తెలిపారు. త్వరలో జరగనున్న ఎన్నికల పోటీ చేయడానికి సర్వం సిద్ధం చేసుకున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో కృష్ణచైతన్యను ఇన్‌ఛార్జి పదవి నుంచి తప్పించినట్లు తెలిపారు. తనిఖీలో భాగంగా అధికారులు క్వారీకి అనుమతి ఉందా లేదా, అనుమతి ఉంటే క్వారీలో అనుమతులకు మించి రాయి తీస్తున్నారా లేక చట్టాన్ని ఉల్లంఘించి అనుమతికి మించి రాళ్ల తీస్తున్నారా అన్న విషంపై ఆరా తీశారు. ఈ తనిఖీల్లో మైనింగ్ ఆర్ఐ రాజు మైనింగ్ సర్వేయర్ ఆసిఫ్ పాల్గొన్నారు. కృష్ణ చైతన్య క్వారీలో మైనింగ్ అధికారుల తనిఖీలపై ప్రజలు పెద్దఎత్తున చర్చించుకుంటున్నారు.



క్వారీలో తనిఖీలు నిర్వహిస్తున్న మైనింగ్ అధికారులు

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు

- పోలీస్, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఎస్‌సి, ఎస్‌టి అత్యాచార నిరోధక చట్ట స్ఫూర్తి దెబ్బతినకుండా బాధితులకు సత్వరమే న్యాయం జరిగేలా దష్టి సారించాలని పోలీసులు, రెవెన్యూ అధికారులకు కలెక్టర్ దినేష్ కుమార్ సూచించారు. జిల్లా ఎస్‌సి, ఎస్‌టి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం ప్రకాశం భవనంలో కలెక్టర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఎస్‌పి మల్లీ గర్గ్‌తో కలిసి ఈ చట్టంలో నమోదైన కేసుల స్థితిగతులపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యక్తిగత ప్రయోజనాలను ఆశిస్తూ ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై కేసుల నమోదు, దర్యాప్తు విషయంలో అవగాహనతో వ్యవహరించాలన్నారు. కేసులలో నిజమైన బాధితులకు న్యాయం జరగడంలో ఎలాంటి లోపం, జాప్యం లేకుండా చూడాలన్నారు. బాధితులకు ఇచ్చే పరిహారాన్ని పంపిణీ చేసే సమయంలోనే వారి పిల్లలకు కూడా లభించేలా చర్యలు తీసుకుంటామన్నారు. భూ సంబంధిత వివాదాల కారణంగా నమోదయ్యే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసులలో బాధితులకు చట్ట ప్రకారం ఆర్థిక ప్రయోజనం దక్కడంతోపాటు భూమి నిజమైన హక్కుదారులకే చెందేలా చూడాల్సిన అవసరం ఉందన్నారు. దళితుల భూములను అగ్రవర్ణాల వారు కబ్జా చేస్తున్నారని, కురిచేడులో దళితులకు శ్మశానం వాటిక లేక కాలువ కట్టపై మృతదేహాలను పూడ్చి పెడుతున్నారని సభ్యులు ప్రస్తావించగా, దాని పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసు కోవాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

265 కేసులు నమోదు : ఎస్‌పి

2022, 2023 సంవత్సరాలలో ఈ చట్టంలో 265 కేసులను పోలీసులు నమోదు చేసినట్లు ఎపి మల్లిక గర్గ్ తెలిపారు. అందులో 108 కేసులను పరిష్కరించామని, మిగతా కేసులలో కూడా దర్యాప్తును వేగవంతం చేశామన్నారు. కోర్టులో దోషులకు శిక్ష పడేలా చూడాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎఎస్‌పి కె.నాగేశ్వరరావు, డిఆర్ఒ ఆర్.శ్రీలత, మార్కాపురం సబ్ కలెక్టర్ రాహుల్ మీనా, కనిగిరి, ఒంగోలు ఆర్‌డిఒలు జాన్ ఇర్విన్, వి,విశ్వేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మా నాయక్, గిరిజన సంక్షేమ అధికారి జగన్నాధరావు, డిఇఒ సుబ్బారావు, ఎపిఎస్‌డబ్ల్యు ఆర్ఇఒ జిల్లా కోఆర్డినేటర్ జయ, ఒంగోలు డిఎస్‌పి నారాయణ స్వామి రెడ్డి, దర్శి డిఎస్‌పి అశోక్ వర్ధన్, మార్కాపురం డిఎస్‌పి వీరరాఘవ రెడ్డి, ట్రాఫిక్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పి.లక్ష్మయ్య, జయరావు, బి.రమణమ్మ. పి. నాగరాజు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి-దర్శి

బాలికలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించాలని సూపర్‌వైజర్ సునీత అన్నారు. బుధవారం జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా దర్శి ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని, ప్రస్తుతం పురుషులతో సమానంగా విద్య రంగంతో పాటు రాజకీయ రంగంలో రాణిస్తున్నారని పేర్కొన్నారు. సూపర్‌వైజర్లు నాగమణి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



వెంకటరెడ్డిని పరామర్శిస్తున్న రాఘవరెడ్డి

మారం వెంకటరెడ్డికి మాగుంట పరామర్శ

ప్రజాశక్తి-దర్శి

తాళ్లూరు జడ్పీటీసీ మారం వెంకటరెడ్డి ఇటీవల కంటి ఆపరేషన్ చేసుకోగా ఆయనను ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి కుమారుడు మాగుంట రాఘవరెడ్డి తాళ్లూరు మండలంలోని కొత్తపల్లి గ్రామంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి పరామర్శించారు. ఆయన వెంట ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ డైరక్టర్ అంజలి ప్రసాద్‌రెడ్డి, వీసీ రెడ్డి, గంగిరెడ్డి యలమందారెడ్డి, సర్పంచ్‌లు చార్లసర్జన్, శ్రీకాంత్‌రెడ్డి, వలి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు

ప్రజాశక్తి-దర్శి



అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్న చిన్నారులు

దర్శిలో అంగన్‌వాడీల 42 రోజుల సమ్మె అనంతరం బుధవారం అంగన్‌వాడీ కేంద్రాలు తెరచుకున్నాయి. దీంతో చిన్నారులు కేరింతలు కొడుతూ కేంద్రాలకు వెళ్లారు. చాలా రోజుల తరువాత వెళుతుండడంతో చిన్నారుల్లో ఉత్సాహం కనిపించింది.

దుర్భాషలాడిన వారిపై కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి-కనిగిరి



పోలీస్ స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు

సమస్యల పరిష్కారం కోసం సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ కార్మికుల పట్ల దురుసుగా వ్యవహరిస్తూ దుర్భాషలాడిన కనిగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్, మేస్త్రిపై వెంటనే కేసు నమోదు చేయాలని కోరుతూ కనిగిరి పోలీస్ స్టేషన్ ఎదుట మున్సిపల్ కార్మికులు, సిఐటియు నాయకులు నిరసన తెలియజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పిసి కేశవరావు మాట్లాడుతూ కార్మికులకు సహకారం అందించాల్సిన మున్సిపల్ సిబ్బంది అనుచితంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఇటువంటి సంఘటనలు పునరావతం కాకుండా అధికారులు చొరవ చూపాలని డిమాండ్ చేశారు. ఘటనపై విచారించి తగు చర్యలు చేపట్టడం జరుగుతుందని సీఐ రామకృష్ణారెడ్డి తెలపడంతో నిరసన ఉపసంహరించుకున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు బషీర, నరేంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఎస్కే ఖాదర్‌వలి, సిహెచ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ' ఫిబ్రవరిలో జాతికి అంకితం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

దశాబ్దాల కల నెరవేరబోతోందని, వెలిగొండ ప్రాజెక్టు ఫిబ్రవరి మొదటి వారంలో జాతికి అంకితం చేయనున్నారని, ఈ ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డిదేనని, ఆయనకు ఈ ప్రాంత ప్రజలు ఎప్పటికీ రుణపడి ఉంటారని మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా 4.38 లక్షల ఎకరాలకు సాగునీరు, 15 లక్షల జనాభాకు తాగునీటి అవసరాలు తీరనున్నాయని అన్నారు. నాటి ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖరరెడ్డి, నేటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల పాత్ర వెలిగొండ ప్రాజెక్టులో ఉందన్నారు. విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు షేక్ ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, ఎంపిపి పోరెడ్డి అరుణ చెంచిరెడ్డి, జడ్‌పిటిసి నారు బాపన్‌రెడ్డి, శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, వైసిపి పట్టణ ప్రచార కార్యదర్శి సయ్యద్ మయూరి ఖాశిం, పొదిలి మాజీ ఎఎంసి చైర్మన్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'వెలిగొండ'పై అఖిలపక్షం వేయాలి: టిడిపి

ప్రజాశక్తి-మార్కాపురం: పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు విషయంలో అధికార పార్టీ మోసపూరితంగా వ్యవహరిస్తోందని టిడిపి నేతలు ధ్వజమెత్తారు. సొరంగ మార్గం వ్యాసార్థం కుదింపుతో పశ్చిమ ప్రకాశానికి తీరని అన్యాయం చేశారని మండిపడ్డారు. వెలిగొండ పూర్తయినట్లు, త్వరలో జాతికి అంకితం చేస్తారని ప్రకటించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడి పనులు అక్కడే పెట్టుకుని ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. బుధవారం స్థానిక జవహర్‌నగర్ కాలనీలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు మాట్లాడారు.

కొండారెడ్డికి రాఘవరెడ్డి పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం



మాజీ ఎమ్మెల్యే కొండారెడ్డిని పరామర్శిస్తున్న మాగుంట రాఘవరెడ్డి

రాజకీయ కురు వృద్ధుడు, మాజీ ఎమ్మెల్యే కెపి కొండారెడ్డి వయోభారం కారణంగా గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వైద్య చికిత్సల అనంతరం మార్కాపురంలోని స్వగృహానికి కొండారెడ్డిని తీసుకువచ్చారు. ఎంపి మాగుంట శ్రీనివాసుల రెడ్డి తనయుడు మాగుంట రాఘవరెడ్డి పెద్దాయన కొండారెడ్డిని బుధవారం పరామ ర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిం చారు. ఎమ్మెల్యే నాగార్జునరెడ్డితో పాటు కుందురు కృష్ణమోహన్‌రెడ్డిలతో కెపి ఆరోగ్యం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చెన్నకేశవుని ఆలయంలో ప్రత్యేక పూజలు

మార్కాపురం విచ్చేసిన మాగుంట రాఘవరెడ్డి ప్రసిద్ధి గాంచిన శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవరెడ్డికి ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ పెనుగొండ కేశవరావు, కార్యనిర్వహణాధికారి గొలమారి శ్రీనివాసరెడ్డి స్వాగతం పలికారు. ఆయన వెంట మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ తదితరులు ఉన్నారు.

'జంకె'ను కలిసిన మాగుంట

వైసిపి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని ఎంపి మాగుంట శ్రీనివాసులరెడ్డి తనయుడు రాఘవరెడ్డి బుధవారం కలుసుకున్నారు. కొద్దిసేపు ప్రస్తుత రాజకీయాల గురించి చర్చించినట్లు తెలిసింది.

వికసిత భారత్ సదస్సులు

ప్రజాశక్తి-పిసి పల్లి

పిసిపల్లి మండలంలోని నేరేడుపల్లి, మురుగుమ్మి పంచాయతీలలో బుధవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక రాజ్యసభ సభ్యులు నాదం రెబియా ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. 2047 నాటికి ప్రపంచ గురువుగా భారతదేశం మారబోతుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎంపీడీవో కే శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి జాలిరెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు రీజినల్ మేనేజర్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు గురించి వివరించారు.

మురుగు కాలువలో మెట్ట తామర మొక్కలు

ప్రజాశక్తి-సంతనూతలపాడు




మురుగు కాలువలో మెట్ట తామర నాటిస్తున్న డిపిఒ

జిల్లా పంచాయతీ అధికారి జివి నారాయణ రెడ్డి ఆదేశాల మేరకు సంతనూతలపాడు గ్రామంలోని మెయిన్ రోడ్డు పక్కనున్న శివాలయం వద్ద గల ప్రధాన డ్రైనేజీలో మురుగు నీరు సమస్య పరిష్కార నిమిత్తం బుధవారం మెట్ట తామర మొక్కలను నాటించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ మెట్ట తామర మొక్కలను కాలువలలో నాటడం వలన మురుగు సమస్యతోపాటు దోమల సమస్యను పరిష్కరించడమే గాక పూలమొక్కలతో ఆ ప్రాంతం అందంగా కనిపిస్తుందని చెప్పారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ దర్శి నాగమణి, పంచాయతీ కార్యదర్శి ఎన్ ప్రతాప్ కుమార్, ఈఒఆర్డి జీ రామకృష్ణలను అభినందించారు.

వైఎస్ఆర్ ఆశయ సాధనకు కృషి: దద్దాల

ప్రజాశక్తి-కనిగిరి

వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమితులైన డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరిచయ కార్యక్రమం బుధవారం స్థానిక పవిత్ర ఫంక్షన్ హాల్‌లో ఒమేగా రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. తొలుత ఆయన కుటుంబ సభ్యులతో కలిసి మండలంలోని నందన మారెళ్ల బాల కోటేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్కడ నుంచి కనిగిరికి భారీ ర్యాలీతో తరలిరాగా ప్రజా ప్రతినిధులు, వైసిపి శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. వైఎస్సార్, అంబేద్కర్, జ్యోతిరావు పూలే, గాంధీజీ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పరిచయ వేదిక వద్దకు చేరుకున్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన వైసిపి జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి కనిగిరి ఇన్‌ఛార్జిగా దద్దాల నారాయణ యాదవ్‌ను పార్టీ శ్రేణులకు, ప్రజలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్



ప్రజలకు అభివాదం చేస్తున్న వైసిపి కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల

మోహన్‌రెడ్డి మార్పు కోరుకుంటున్నారని, ఆ మార్పులో భాగంగానే యువకుడు విద్యావంతుడైన దద్దాల నారాయణ యాదవ్‌ను కనిగిరికి ఇన్‌ఛార్జిగా నియమించారని అన్నారు. కనిగిరి మీద సీఎం జగన్మోహన్‌రెడ్డి పెట్టుకున్న ఆశలు నెరవేరేలా దద్దాల నారాయణ యాదవ్ ను భారీ మెజారిటీతో గెలిపించి కనిగిరి గడ్డ వైసిపి అడ్డా అని నిరూపించాలని సూచించారు. వైసిపి కనిగిరి ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ తాను ఒక సామాన్య కార్యకర్తగా మీలో ఒక్కడిగా వైఎస్సార్ ఆశయ సాధనకు కృషి చేస్తానని, ఆదరించాలని కోరారు. ఈ సందర్భంగా జంకె వెంకటరెడ్డిని ఆయన ఘనంగా సత్కరించారు. నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, వైసిపి శ్రేణులు, అభిమానులు ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను ఘనంగా సత్కరించి మద్దతు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ ఛైర్మన్ వైఎం ప్రసాదరెడ్డి, జడ్పిటిసిలు మడతల కస్తూరిరెడ్డి, గుంటక తిరపతిరెడ్డి, మేకల శ్రీనివాసులు, పీసీ పల్లి ఎంపీపీ జఫన్యా, కనిగిరి, సిఎస్ పురం వైస్ ఎంపీపీలు లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, ప్రతాప్ రెడ్డి, కనిగిరి మున్సిపల్ వైస్ ఛైర్మన్లు పులి శాంతి, మాణిక్యరావు, కౌన్సిలర్లు దేవకి రాజీవ్, శ్రీరామ్ సతీష్, వైసిపి నాయకులు కటికల వెంకటరత్నం, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మూలే గోపాల్ రెడ్డి, తూము వెంకటకృష్ణారెడ్డి, నరాల రమణారెడ్డి, డాక్టర్ రసూల్, ఓకే రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకం మండలంలోని గుట్లల ఉమ్మడివరంలో ప్రమాదవశాత్తూ గుడిసెలో మంటలు చెలరేగిన సంఘటన బుధవారం జరిగింది. వంట చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో చుట్టుపక్కల ప్రజలు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే గుడిసె కాలి పక్కనే ఉన్న ట్రాక్టర్ కూడా అగ్నికి ఆహుతి అయింది. నష్టపోయిన తనను ఆదుకోవాలని బాధితుడు శ్రీను వాపోయాడు.



పెట్లూరులో విరిగిపడ్డ కరెంటు స్తంభం, వాలిన వైఎస్ఆర్ విగ్రహం

పెన్షనర్ల సమస్యలపై నేడు ధర్నా

ప్రజాశక్తి-పొదిలి

సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర పెన్షనర్స్ సంఘం పిలుపు మేరకు గురువారం పొదిలి తహశీల్దారు కార్యాలయం వద్ద ధర్నా జరుగుతుందని పొదిలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఏ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి తెలిపారు. పొదిలి, మర్రిపూడి, కొనకనమిట్ల మండలాలలోని ప్రభుత్వ పెన్షనర్లు అందరూ ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పొదిలి పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి కోరారు.

మొక్కుబడిగా మండల సమావేశం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం మొక్కుబడిగా సాగింది. ఈ సమావేశంలో గ్రామాల్లోని సమస్యలు, అభివృద్ధిపై చర్చించేందుకు అవకాశ మున్నా తూతూమంత్రంగా నిర్వహించి చేతులు దులుపుకున్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిపి పోరెడ్డి అరుణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. 21 మంది సర్పంచులకు గాను, ఆరుగురు సమావేశానికి హాజరుకాగా 15 మంది గైర్హాజరయ్యారు. 14 మంది ఎంపిటిసిలకుగాను, 8 మంది హాజరుకాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. పలు శాఖల అధికారులు సైతం గైర్హాజరయ్యారు. పలుశాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. సభ్యులు ఎవరూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకు రాలేదు. దీంతో సమావేశం గంటన్నరలో



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి పోరెడ్డి అరుణ

ముగిసింది. ఈ సందర్భంగా ఎంపిపి పోరెడ్డి అరుణ మాట్లాడుతూ రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని మండల వ్యాప్తంగా నీటి ఎద్దడిని అరికట్టేందుకు ప్రత్యేక కార్యచరణ తయారు చేయాలని గ్రామీణ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్య క్రమంలో జడ్పిటిసి సభ్యులు నారు బాపన్‌రెడ్డి, ఎంపిడివో తోట చందన, రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల కొండయ్య, కో-ఆప్షన్ సభ్యులు షేక్ మొహమ్మద్ రఫీ, ఏపీఓ బి జీవరత్నం, ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు, సర్పంచులు, ఎంపిటిసిలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

బాలికలే భవిష్యత్తుకు పునాది

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

బాలికలే భవిష్యత్తుకు పునాది అని ఎంపిపి దొంతా కిరణ్ గౌడ్ అన్నారు. యర్రగొండపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో షార్ప్స్ సంస్థ ఆధ్వర్యంలో జాతీయ బాలికా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కిరణ్ గౌడ్ మాట్లాడుతూ బాలికలకు రక్షించుకుందామని, వారి హక్కులను కాపాడుకుందామని అన్నారు. ముందుగా గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె రవీంద్రారెడ్డి, ఎంఈవోలు ఆంజనేయులు, మల్లు నాయక్, సర్పంచ్‌లు రామావత్ అరుణాబాయి, ఏకుల ముసలారెడ్డి, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి, షార్ప్స్ సంస్థ ఏపిఎం మరియబాబు, ప్రాజెక్టు మేనేజర్ మారుతీకృష్ణ, సిబ్బంది మహాలక్ష్మి, భాగ్యలక్ష్మి, రామలక్ష్మి, అంకయ్య, ధర్మానాయక్, సుధాకర్, చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

గిద్దలూరు రూరల్: బాలిక సంరక్షణ చట్టాలను నిష్పక్షపాతంగా అమలుపరచాలని, బాలికల అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి అన్నారు. గిద్దలూరు టౌన్‌లో రాజు పారామెడికల్ కాలేజీలో జాతీయ బాలిక దినోత్సవం కార్యక్రమంలో జేవీవీ రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనదేశంలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ తొలిసారిగా ప్రధాన మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన రోజును పురస్కరించుకొని జనవరి 24వ తేదీని జాతీయ బాలిక దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. జేవీవీ అధ్యక్షులు డి వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు కొండేటి రాజేష్, అధ్యాపకులు విజయలక్ష్మి, నాగమణి, షేక్ మహబూబ్‌బీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. విద్యార్థినులు చక్కని అభినయంతో ఆటపాటలతో సందడి చేశారు. నాటికలు, స్కిట్స్, కథనాలతో సత్తా చూపించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి రామారావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మండల విద్యాశాఖాధికారి వెంకటరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ పోటీల విజేతలకు బహుమతులను అందజేశారు.

అక్రమంగా తరలిస్తున్న..

రూ.30.50 లక్షల నగదు స్వాధీనం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అక్రమంగా తరలిస్తున్న రూ.30,50,000 నగదును స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ శ్రీకాంత్ బాబు తెలిపారు. సిఐ కథనం ప్రకారం... రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో వుంచుకొని ఒంగోలు జిఆర్‌పి పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సిహెచ్ రామారావు,



పట్టుబడిన నగదుతో రైల్వే సిఐ శ్రీకాంత్‌బాబు

కానిస్టేబుళ్లు నజీర్ హుస్సేన్, కార్తీక్, ఎన్ఎస్ రావు, ఎం. శ్రీనివాసులు, కే ఉమ రైళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్నారు. బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్ నుంచి చెన్నై వెళ్లే చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో ఒక వ్యక్తి బ్యాగ్‌తో రైలులో ప్రయాణిస్తుండగా అనుమానంతో ఆ బ్యాగ్‌ను తనిఖీ చేశారు. ఎలాంటి రశీదులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ. 26,50,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. రైల్వే పోలీసులు ఆ వ్యక్తిని విచారించగా అతను నరసరావుపేట లోని గోల్డ్ షాప్‌లో గుమస్తాగా పనిచేస్తున్న సొలస సాయి కాశీ విశ్వనాథ్‌గా గుర్తించామ న్నారు. విచారణలో ఆ వ్యక్తి చెన్నైలో బంగారం కొనడానికి డబ్బును తీసుకొని రైలులో చెన్నై ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళుతుండగా ఆ నగదుకు సరైన రసీదులు లేకపోవటంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. ఒంగోలు రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంలో ఒంగోలు రైల్వే పోలీసులు ఆధ్వర్యంలో సాధారణ తనిఖీలు నిర్వహిస్తుండగా ఒకటో నెంబర్ ప్లాట్‌ఫారం వద్ద చీరాల గాంధీ మార్కెట్‌లో క్లాత్ బిజినెస్ చేస్తున్న షేక్ జాఫర్ వద్ద రూ.4 లక్షలు దొరికాయన్నారు. ఆ డబ్బులు కి సంబంధించిన ఎటువంటి పత్రాలు, బ్యాంకు లావాదేవీలు లేకపోవటంతో నగదును స్వాధీనం చేకున్నామన్నారు. ఇద్దరు వ్యక్తులు వద్ద స్వాధీనం చేసుకున్న రూ.30 లక్షల 50 వేల రూపాయలను కేసు కట్టి ఆదాయపన్ను శాఖ అధికారులకు అప్పగిస్తున్నట్లు రైల్వే సిఐ శ్రీకాంత్ బాబు తెలియజేశారు.

25మంది ఎస్ఐలు బదిలీ

ఉత్తర్వులు జారీచేసిన డిఐజి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

గుంటూరు రేంజ్ పరిధిలో 25 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ డిఐజి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని ప్రకాశం జిల్లాకు చెందిన 12 మందిని, గుంటూరు, బాపట్ల జిల్లాలకు, గుంటూరు జిల్లాకు చెందిన 13 మందిని ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. సిఎస్‌పురం ఎస్ఐ పి అనీల్ కుమార్, పామూరు ఎస్ఐ కె సురేష్, ఒంగోలు విఆర్‌లో ఉన్న డి ప్రసాద్, పుల్లలచెరువు ఎస్ఐ వై శ్రీహరి, ఒంగోలు వన్‌టౌన్‌లో విఆర్‌లో ఉన్న ఎస్ సుబ్బారావు, టంగుటూరు ఎస్ఐ ఖాదర్ బాషాను, పెద్దారవీడు ఎస్ఐ టిరాజ్‌కుమార్, వెలిగండ్ల ఎస్ఐ పి మహేష్ కుమార్‌ను గుంటూరు జిల్లాకు బదిలీ చేశారు. ఒంగోలు తాలూకాలో విఆర్‌లో ఉన్న ఎస్.మల్లికార్జునరావు, ఒంగోలు వన్‌టౌన్ డిఎస్‌బిలో ఉన్న ఎం.మురళి, ఒంగోలు తాలూకా, గిద్దలూరు ఎస్ఐ బి.అజిత, మార్కాపురం ఎస్ఐ పి.కోటేశ్వరరావును బాపట్ల జిల్లాకు బదిలీ చేశారు. గుంటూరు జిల్లాకు చెందిన కెవి. కోటేశ్వరరావు, కె.ఆరోగ్య రాజు, కె.విజయ్‌కుమార్, ఎం.కృష్ణ బాజీ బాబు, ఎం.విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, అబ్దుల్ రెహ్మాన్, రాజ్యలక్ష్మి, ఇ.రమాదేవి, టి.రమేష్ బాబును గుంటూరు జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు. మణిపాటి శివ, పి.సురేష్, ఎం.అనితను పల్నాడు జిల్లా నుంచి ప్రకాశం జిల్లాకు బదిలీ చేశారు.

అద్దె బ్యారనులో పొగాకు సాగు లాభదాయకం కాదు

ప్రజాశక్తి-కొండపి: రైతులు కౌలు భూములు, అద్దె బ్యారనులో పొగాకు సాగు లాభదాయకం కాదని సొంత భూములు, బ్యారనులు ఉన్నవారు మాత్రమే పొగాకు సాగు చేయడం శ్రేయస్కరం అని వేలం నిర్వహణాధికారి జి సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం వేలం కేంద్ర పరిధిలోని నేతివారిపాలెం గ్రామంలో బోర్డు వారి ఆధ్వర్యంలో పొగాకు రైతులకు పొగాకు క్యూరింగ్, గ్రేడింగ్ జాగ్రత్తల మీద శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు.

బస్సుకు తప్పిన పెనుప్రమాదం

ప్రజాశక్తి-కొండపి

ఆర్టీసి బస్సుకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఈ సంఘటన కొండపి మండలంలోని పెట్లూరులో బుధ వారం జరిగింది. వివరాలలోకి వెళ్లగా.. పొదిలి డిపోకు చెందిన ఆర్టీసి బస్సు కొండపి నుంచి పొదిలికి బయలు దేరింది. పెట్లూరులోని మలుపు వద్ద రోడ్డుకు ఆవైపు ఈవైపు కరెంటు స్తంభానికి ఫైబర్ వైరు ఉంది. ఆ ఫైబర్ వైరు ఆర్టీసి బస్‌కు తగులుకున్నా డ్రైవర్ గమనించక పోవడంతో మెయిన్ స్తంభాలు విరిగిరోడ్డు పక్కన ఉన్న వైఎస్ఆర్ విగ్రహంపై పడ్డాయి. విగ్రహం అడ్డులేకపోతే ఆ కరెంటు స్తంభాలు ఆర్టీసి బస్సుపై పడి పెద్ద ప్రమాదం జరిగిఉండేది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఎటువంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకు న్నారు. ఘటన సమయంలో బస్సులో 30 మంది ప్రయాణికులు ఉన్నారు.

విఆర్ఓపై చర్య తీసుకోవాలి

ప్రజాశక్తి-సిఎస్ పురం: అరివేముల విఆర్ఓ కాశీవిశ్వేశ్వరరెడ్డి అవినీతి, లంచగొండితనానికి అంతు లేకుండా పోతోందని, సమస్యలపై వచ్చిన వారితో నిర్లక్ష్యంగా మాట్లాడుతూ రైతులను ఇబ్బంది పెడుతు న్నారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మారంరెడ్డి రత్నారెడ్డి అన్నారు. విఆర్ఓపై తగిన చర్యలు తీసుకోవాలని రైతు సంఘం ఆధ్వర్యంలో గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక తహశీల్దారు కార్యాల యం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దారు షేక్ నాగుల్‌మీరాకు రైతు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు.



పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కె నాగార్జునరెడ్డి

ఆటల పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

రాష్ట్రంలో ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు కీలక ఘట్టంలోకి ప్రవేశించాయని, గ్రామ, వార్డు సచివాలయ మండల స్థాయి పోటీలను దిగ్విజయంగా ముగించుకుని నియోజకవర్గ స్థాయిలో సత్తా చాటేందుకు జట్లు ఉరకలేస్తున్నాయని మార్కాపురం శాసనసభ్యులు కే నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన నియోజకవర్గ ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం మున్సిపల్ ఛైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, మార్కాపురం, తర్లుపాడు మండలాల ఎంపిపిలు పోరెడ్డి అరుణ, భూలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ డి రవీంద్ర, ఎంపిడివో తోట చందన, మార్కాపురం మండల విస్తరణ అధికారి రామ్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



బిస్కెట్లు పంపిణీ చేస్తున్న వీరనారాయణ

పాఠశాలలకు బిస్కెట్లు పంపిణీ

ప్రజాశక్తి - పంగులూరు

గణతంత్ర దినోత్సవ సందర్భంగా పాఠశాలల్లోని విద్యార్థులకు బిస్కెట్లు అందించేందుకు మండలంలోని 46పాఠశాలలకు తమ ట్రస్టు ద్వారా బిస్కెట్లు పంపిణీ చేసినట్లు అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, విద్యా దాత వడ్డవల్లి వీరనారాయణ తెలిపారు. తన కుమారుడు అజిత్ కుమార్ జ్ఞాపకార్థం ప్రతి ఏటా ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవానికి, జనవరి 26న గణతంత్ర దినోత్సవానికి పాఠశాలల్లోని విద్యార్థులకు పంచేందుకు బిస్కెట్లను అందిస్తున్నామని అన్నారు. ప్రాథమిక పాఠశాలలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలలకు ఈ బిస్కెట్లను పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. రెండు రోజులు ముందుగానే బిస్కెట్ ప్యాకెట్లను మండలంలోని అన్నీ పాఠశాలలకు పంపిణీ చేశామని తెలిపారు. ఉపాధ్యాయులు వాటిని విద్యార్థులకు అందజేయాలని కోరారు.



నీరు విడుదల చేస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి హనిమిరెడ్డి

సాగునీరు విడుదల

ప్రజాశక్తి - అద్దంకి

శింగరకొండ భవనాశి చెరువు నుండి వేలమూరిపాడు గ్రామం వరకు ఉన్న పంట కాలువకు వైసీపీ ఇన్చార్జి పానెం చిన్న హనిమిరెడ్డి బుధవారం సాగునీరు విడుదల చేశారు. భవనాశి చెరువు నుండి పాత దామవారిపాలెం, పెరిక పాలెం, నర్రావారిపాలెం, వేలమూరిపాడు గ్రామ రైతులకు సంబంధించిన సాగు భూములకు నీటి విడుదల చేయడం ద్వారా మాగాణి సాగు అవుతుందని అన్నారు. రైతులు నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. నీటి వృధాను అరికడితే మరొక ఎకరానికి సాగుకు నీరు అందు తుందని అన్నారు. వైసిపి మండల కన్వీనర్, పట్టణ అధ్యక్షుడు, ఎంపీటీసీలు, సర్పంచులు, వివిధ హోదాల్లో ఉన్న వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



డ్రైవర్లకు బహుమతులు అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

ఆర్‌టిసి బస్సుల్లో సురక్షిత ప్రయాణం

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ బస్సుల్లోనే సురక్షిత ప్రయాణానికి మార్గమని ప్రజా రవాణా జిల్లా అధికారి వై విజయకుమార్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా డ్రైవర్స్ డే సందర్భంగా స్థానిక కొత్త బస్టాండులో బుధవారం జరిగిన సభలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పలువురు డ్రైవర్లతో పాటు, పాఠశాల విద్యార్థులను సకాలంలో సక్రమంగా పాఠశాలలకు చేర్చే ఆర్టీసీ బస్సు డ్రైవర్లను అభినందించారు. జిల్లా కేంద్రమైన బాపట్ల నుండి అన్ని నియోజకవర్గలతో పాటు మారుమూల గ్రామీణ ప్రాంతాలకు సైతం ఆర్టీసీ బస్సులు నడిపేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందిస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికుల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో విజయవాడ – గుంటూరు ప్రాంతాలకు అధిక సర్వీసులు నడపాల్సి వస్తోందన్నారు. రానున్న రోజుల్లో వేమూరు నియోజకవర్గ కేంద్రం, గ్రామాలను బాపట్లకు అనుసంధానం చేస్తూ బస్సులు నడుపుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉమ్మడి గుంటూరు జిల్లా డిప్యూటీ సీఎంఇ ఎస్ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ టీ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇంచార్జ్ పి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

రహదారులపై ప్రమాదాలను పూర్తిస్థాయిలో అరికట్టేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పి రంజిత్ బాషా అధికారులను ఆదేశించారు. రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా రహదారుల భద్రతపై జిల్లాస్థాయి కమిటీ సమావేశం తన క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించారు. ప్రజల ప్రాణాలు రక్షించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అన్నారు. ఏదైనా ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను తక్షణమే వైద్యశాలకు తరలించి, వారికి వైద్యం అందించేలా చూడాలన్నారు. జాతీయ రహదారిపై నమోదవుతున్న కేసుల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈపాటికే గుర్తించిన బ్లాక్ స్పాట్స్ వద్ద ప్రమాదాల నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అవసరమైన నిధులు మినరల్ ఫండ్ నుంచి వినియోగించాలన్నారు. రహదారి భద్రతకు సంబంధించిన నియమ నిబంధనలపై లారీ డ్రైవర్లకు విస్తృతమైన అవగాహన కల్పించాలన్నారు.



సమావేశంలో సూచనలు చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

వాహనాలు, డ్రైవర్ల లైసెన్స్‌ల పునరుద్ధరణకు వచ్చే సమయంలో వాహనాల కండిషన్ నిశితంగా పరిశీలించాలన్నారు. రహదారుల భద్రత, నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. అద్దంకి – నార్కెట్‌పల్లి జాతీయ రహదారిపై ప్రమాదాలు కాస్త తగ్గుముఖం పట్టాయన్నారు. 216జాతీయ రహదారిపై ప్రమాదాలు మరింత తగ్గేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాహనాలు నడపడంపై కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రమాదాలు జరగడానికి కారణాలను యువతకు వివరించాలన్నారు. 2022లో జిల్లాలో 645 ప్రమాదాలు నమోదు అయ్యాయని అన్నారు. 2023లో 568 ప్రమాదాలు జరిగాయన్నారు. వీటిని పూర్తిగా తగ్గించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టాలన్నారు. జాతీయ రహదారిలోకి ప్రవేశించే అప్రోచ్ రోడ్లు, గ్రామాల నుంచి వచ్చే ప్రధాన రహదారుల వద్ద బ్యారికేట్లు ఏర్పాటు చేయాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కింద గడిచిన ఏడాదిలో 1,806 కేసులు నమోదు చేశామన్నారు. వారికి రూ.22.87లక్షలు జరిమానా విధించామన్నారు. కొన్ని గ్రామాల్లో రహదారుల వెంట చిల్లచెట్లు పెరగడం ద్వారా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు అధికారులు కలెక్టర్ దృష్టికి తెచ్చారని అన్నారు. స్పందించిన కలెక్టర్ వెంటనే చిల్లచెట్లు తొలగించాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ పి మహేష్, రవాణా శాఖ అధికారి ఎ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ శ్రీనివాసులు, వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డాక్టర్ ఎస్ విజయమ్మ, మోటర్ వెహికల్ ఇన్ స్పెక్టర్లు రాంబాబు, రంగారావు, సహాయ ఎంవిఐలు కిషోర్ బాబు పాల్గొన్నారు.

నీరు లేక ఎండుతున్న పంటలు..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఖరీఫ్ సీజన్‌కు చివరిలో కురిసిన మిచాంగ్ తుఫాన్ భారీ వర్షాల అనంతరం సాగునీటి కాలువలకు అధికారులు నీటిని నిలిపివేశారు. కురిసిన వర్షానికి ఉన్న నీటిని బయటికి మళ్లించుకొని రైతులు పంటలను ఒడ్డుకు చేర్చుకున్నారు. అనంతరం రబీకి సాగుచేసిన మినుము, పెసర, జొన్న, మొక్కజొన్న వంటి పంటలకు ఆరుతడి నీరు అవసరమై ఉంది. అధికారికంగా పంటలకు సాగునీటిని విడుదల చేయకపోయినా కనీసం రబీలో సాగు చేసిన మినుము, మొక్కజొన్న పంటలకు మందులు కొట్టుకోవడా నికైనా సాగునీరు వస్తుందనుకున్న రైతులకు నిరాశే కనిపిస్తుంది. వర్షాల అనంతరం తగ్గిన నీటితో పంట పొలాలు ఎండిపోయి బీళ్లుగా మారుతున్నాయి. కనుచూపు మేరలో ఎక్కడా చుక్క నీరు కనిపించకపోవడంతో రైతులు పురుగు మందులు పిచికారి చేసుకోవడానికి కూడా నీళ్ల లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పంటకు నీరు పెట్టే సంగతి పక్కనపెట్టినా కనీసం ఉన్న పంటకు పడుతున్న పురుగు నివారణకు మందులు పిచ్చికారి చేసుకోవటాని కైనా నీళ్ళు వస్తాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. నవంబరు నెల చివరిలో నిలిపేసిన సాగునీటి కాలువలు ప్రస్తుతం ఎండిపోయి వేసవి కాలాన్ని తలపిస్తున్నాయి. నీటిని నిలుపుదల చేసి రెండు నెలలు గడుస్తున్నప్పటికీ కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు చుక్కనీరు విడుదల చేయకపోవడం పట్ల బోరు వసతి లేని గ్రామాల్లో సాగు



ఐలవరంలో ఎండిపోతున్న మినుము పంట



నీరు లేక ఎండిపోయిన పంట కాలువ

చేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రబీ సీజన్లో ఆరు తడికైనా సాగునీరు అందుతుందని భావించిన రైతులకు నీరు అందుబాటులో లేకపోవడంతో రూ.వేలల్లో వెచ్చించి సాగు చేసిన పంటలు ఎండలకు ఎండిపోయి నష్టాలను చవిచూడాల్సి వస్తుం దేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భట్టిప్రోలు మండలంలో వెల్లటూరు, పెద్దపల్లివర్రు, గొరిగపూడి, ఓలేరు, సూరేపల్లి గ్రామాల్లో మాత్రమే బోరు వసతి ఉంది. మిగిలిన భట్టిప్రోలు, అద్దేపల్లి, ఐలవరం, కోనేటిపురం, పల్లెకోన, రాచూరు గ్రామాలకు బోరు వసతి లేకపోవడంతో సాగునీటి కాలువలపైనే ఆధారపడి పంటలను సాగు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ గ్రామాల్లో సాగునీరు విడుదల కాదనే దృక్పథంతో అధిక శాతం రైతులు మినుము, పెసర సాగు చేశారు. ఈ సాగు చేసిన అపరాల పంటకు కూడా పురుగు మందులు పిచికారి చేయటానికి నీరు అందుబాటులో లేకపోవడంతో వాటర్ ప్లాంట్ల నుండి 20లీటర్ల టిన్ను రూ.20నుండి రూ.30 చొప్పున కొనుగోలు చేసి పురుగు మందులు పిచికారి చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని రైతులు వాపోతున్నారు. దీని ప్రకారం ఎకరాకు 200లీటర్ల నీటిని కొనుగోలు చేయడానికి రూ.3 నుంచి రూ.4వందలు ఖర్చవుతుందని రైతుల చబుతు న్నారు. ఇప్పటికైనా నీటిపారుదల శాఖ అధికారులు రైతుల దుస్థితిని గుర్తించి సాగునీటి కాలువలకు కొంతమేరైనా నీటిని విడుదల చేయాలని కోరుచున్నారు. ఈ విషయంపై నీటిపారుదల శాఖ ఏఇ రవిబాబు మాట్లాడుతూ కృష్ణా నదిలో నీరు తక్కువగా ఉండటం వలన విడుదలలో జాప్యం జరిగిందని తెలిపారు. ప్రస్తుతం సీతానగరం వద్ద కృష్ణా పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. ఆ నీరు మరో రెండు, మూడు రోజుల్లో మన ప్రాంతానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిపారు.

గణతంత్ర వేడుకల కవాతు అద్భుతంగా నిర్వహించాలి

ఎస్‌పి వకుల్ జిందాల్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

కవాతు రిహార్సల్స్ అద్భుతంగా నిర్వహించారని, జనవరి 26న గణతంత్ర దినోత్సవం నాడు నిర్వహించనున్న కవాతు మరింత అద్భుతంగా నిర్వహించాలని ఎస్పీ వకుల్ జిందాల్ కవాతు నిర్వహించిన పోలీస్ అధికారులు, సిబ్బం దికి సూచించారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో గణతంత్ర దినోత్సవ వేడుకల కోసం ఎఆర్ డిఎస్పీ ఎండి హెచ్ ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీస్ కవాతు రిహార్స ల్స్‌కు ఆయన వచ్చి తిలకించారు. ముందుగా జాతీయ పతాకాన్ని ఎస్‌పి ఎగురవేసి జెండా వందనం సమర్పిం చారు. అనంతరం పెరేడ్ కమాండర్‌గా వ్యవహరించిన అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మధరావు ఎస్‌పికి గౌరవ వందనం సమర్పించి, కవాతు పరిశీలన కొరకు ఆహ్వానించారు. పరేడ్ కవాతు పరిశీలన వాహనంలో పర్యటించి కవాతులో ఉన్న బలగాలను పరిశీలించి తిరిగి వేదిక వద్దక చేరుకున్నారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులు, పాఠశాల విద్యార్థులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ఠ భద్రతాపరమైన చర్యలు తీసుకోవాలని, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని చెప్పారు. కవాతు అనంతరం



కవాతు రిహార్సల్స్ ను తిలకిస్తున్న ఎస్‌పి వకుల్ జిందాల్

నిర్వహించే శకట ప్రదర్శనలో శకటానికి శకటానికి మధ్య సమాన దూరం ఉండేవిధంగా చూసుకోవాలని అన్నారు. ఇతర ప్రభుత్వ శాఖల అధికారులతో సమన్వయంగా వ్యవహరిస్తూ గణతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, ఎఆర్ డిఎస్‌పి ఎండిహెచ్ ప్రేమ్ కుమార్, బాపట్ల డిఎస్‌పి టి వెంకటేశులు, ఎస్‌బి ఇన్స్పెక్టర్ వి సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మధరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్, హోంగార్డ్స్ ఆర్ఐ ఎల్ గోపీనాథ్, ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది, ఎన్‌సిసి విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఐగా మల్లికార్జునరావు

ప్రజాశక్తి - రేపల్లె



సిఐ మల్లి కార్జునరావు

రేపల్లె రూరల్ నూతన సిఐగా మల్లి కార్జునరావు బుధవారం ఉద్యోగ బాధ్యతలు తీసుకున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన రేపల్లె వచ్చారు. స్టేషన్ సిబ్బంది పుష్ప గుచ్ఛమిచ్చి ఆయనకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. శాంతి భద్రతలు కల్పించడంలో అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుందని అన్నారు. ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి వహించి నియంత్రణకు కృషి చేస్తానని అన్నారు. శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పనిచేస్తామ న్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. మట్కా, గుట్కా, పేకాట, ఇసుక ఆ క్రమ రవాణాకు సంబంధించి ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడే ప్రసక్తేలేదన్నారు. స్నేహపూరిత వాతావరణంలో విధులు నిర్వహిస్తు లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా పరిరక్షిస్తానని అన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

వైసిపి ఆత్మీయ సమ్మేళనం సాక్షిగా..

బయటపడ్డ లుకలుకలు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

త్రిపురాంతకంలో బుధవారం వైసిపి నూతన సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో లుకలుకలు బహిర్గతమయ్యాయి. నూతన ఇన్‌ఛార్జి చంద్రశేఖర్ అందరినీ కలుపుకొని పోవడంలేదన్న ఆరోపణలు బలంగా వినిపించాయి. ముందుగా త్రిపురాంతకంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అయితే ర్యాలీ సమయంలో తన భర్తను పట్టించుకోవడం లేదని రాజుపాలెం ఎంపిటిసి చల్లా జ్యోతి ఆగ్రహం వ్యక్తం చేశారు. చల్లా జ్యోతి భర్త చల్లా యల్లారెడ్డి వైసిపి మండల ఉపాధ్యక్షునిగా ఉన్నారు. అయితే తనను కలుపుకొని పోలేదన్న ఆగ్రహంతో ర్యాలీగా వెళ్తున్న చంద్రశేఖర్ వాహనాన్ని అడ్డంగా నిలబడి నిలిపివేసింది. తన భర్తను కారులో ఎక్కించుకొని తీసుకెళ్లాలంటూ ఆగ్రహం వ్యక్తం చేసింది. చంద్రశేఖర్ తన కారులో యల్లారెడ్డిని ఎక్కించుకున్న తర్వాత ఆమె అడ్డు తొలగింది. ఆ తర్వాత అన్నదాన సత్రంలో ఏర్పాటు చేసిన సభలో చంద్రశేఖర్ మాట్లాడుతూ కుటుంబంలో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు రావడం సహజమేనన్నారు. అందరినీ కలుపుకొని పోతానని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి వెలిగొండ ప్రాజెక్టుకు శ్రీకారం చుడితే ఆయన తనయుడు జగన్మోహన్‌రెడ్డి దానిని పూర్తి చేశారని తెలిపారు. త్వరలోనే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభిస్తారని చెప్పారు. యర్రగొండపాలెంలో వైసిపి జెండాను ఎగురవేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, మాజీ ఎంపిపి ఇళ్ల ఆంజనేయరెడ్డి, జడ్పిటిసి మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రంగబాబు, వైసిపి మండల ఉపాధ్యక్షుడు చల్లా యల్లారెడ్డి, వైసిపి నాయకులు మల్లికార్జునతో పాటు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ప్రజలకు అభివాదం చేస్తున్న చంద్రశేఖర్

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

ప్రజాశక్తి-దర్శి

విద్యార్థులు క్రీడల్లో రాణించి దర్శికి మంచి పేరు తీసుకురావాలని జిల్లా పరిషత్ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి మాజీ ఎమ్మెల్యే, వైసిపి ఇన్‌ఛార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆడుదాం ఆంధ్ర-ఇది అందరి ఆట కార్యక్రమాన్ని నియోజకవర్గ స్థాయిలో దర్శిలోని శివరాజ్‌నగర్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా రిబ్బన్ కట్ చేసి ఆటలను ప్రారంభించారు. అనంతరం క్రికెట్ ఆడి ఆటను ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ హనుమంతరావు, ఈవోఆర్డీ జి శోభన్‌బాబు, కమిషనర్ మహేశ్వరరావు, ఎంఈఒలు కాకర్ల రఘురామయ్య, రమాదేవి, ఐదు మండలాల ఎంపిడిఒలు, క్రీడాకారులు పాల్గొన్నారు.


క్రికెట్‌ను ప్రారంభిస్తున్న వైసిపి దర్శి ఇన్‌ఛార్జి బూచేపల్లి

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-పొన్నలూరు

మండలంలోని చెన్నిపాడులో బుధవారం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాన్ని మున్సిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, కొండెపి నియోజకవర్గ వైసిపి ఇన్‌ఛార్జి ఆదిమూలపు సురేష్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మన ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెట్టిన సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, మారుమూల గ్రామాలలో నిర్మించడం వలన ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. వచ్చే ఎన్నికలలో మీరందరూ ముఖ్యమంత్రిగా జగన్ అన్నను, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పి బాలకోటిరెడ్డి, ఎంపిపి కె మాధవరావు, జడ్పిటిసి బి వెంకటేశ్వర్లు, మండలంలోని వైసిపి కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.


రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

'నా ఎస్సీలు, నా ఎస్టీలు' అని నట్టేట ముంచాడు

ప్రజాశక్తి-గిద్దలూరు

పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో అర్ధవీడు మండలం గన్నేపల్లె గ్రామానికి చెందిన గుడిపాటి వెంకటయ్య, గుడిపాటి యోహాను ఆధ్వర్యంలో ఎస్సీ కుటుంబాలు తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి నా ఎస్సీలు, నా ఎస్టీలు అని నట్టేట ముంచాడని, నిత్యం ఎస్సీలపై దాడులు చేస్తుంటే చోద్యం చూస్తూ దద్దమ్మ పాలన చేస్తున్నాడని అన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎస్సీల ద్రోహి జగన్‌రెడ్డికి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైసిపిని వీడి టిడిపిలో చేరిన ఎస్సీ సోదరులు బేతం రాజు, బాబు, అనిల్, మామిళ్ల లక్ష్మయ్య, జుంజు ఏసురత్నం తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు జగనన్న టోకరా

ప్రజాశక్తి-గిద్దలూరు

రాష్ట్రంలో అరాచక పాలన చేస్తున్న జగన్ మహిళలకు టోకరా వేస్తున్నారని టిడిపి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్‌రెడ్డి వైసిపి సర్కార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి ఇన్‌ఛార్జి అశోక్‌రెడ్డి మాట్లాడుతూ నాడు పసుపు కుంకుమ ద్వారా చంద్రన్న పాలనలో కోటిమంది మహిళలు ఒక్కొక్కరు రూ.20 వేలు లబ్ధి పొందారన్నారు. జగన్‌రెడ్డి పాలనలో ఒక్కొక్క మహిళ పొందిన లబ్ధి రూ.15 వేలకు తగ్గిపోయిందని అన్నారు. ఈ రకంగా 50 లక్షల మంది డ్వాక్రా మహిళలకు జగన్‌రెడ్డి టోకరా వేశారు. నేడు రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే వారిని 79 లక్షలకు కుదించారన్నారు.

టిడిపిలోకి కొనసాగుతున్న వలసలు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

ప్రజాశక్తి-వెలిగండ్ల

వెలిగండ్ల మండలం బొంతగుంటపల్లి ఎస్సీ కాలనీలోని మొత్తం 55 కుటుంబాలు మూకుమ్మడిగా వైసిపి నుంచి టిడిపిలోకి చేరారు. వీరిని నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. దీంతో ఎస్సీ కాలనీలోని అన్ని కుటుంబాలు టిడిపికి రావడంతో వారికి ధన్యవాదాలు తెలిపారు. బద్దిపూడి వెంగయ్య, కంచర్ల జయరావు, కంచర్ల ఆదాం, వేశపోగు రామయ్య, యేసేపు వెలుగొండయ్యలతో పాటు మొత్తం కాలనీలోని 55 కుటుంబాలు వైసిపి నుంచి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన పార్టీ టిడిపి అని, ప్రజలతో ఉండిపని చేసే పార్టీ టిడిపి అని, వైసిపి వచ్చాక ఉద్యోగ అవకాశాలు కోల్పోయారు అన్నారు. ఎస్సీలకు తీవ్ర అన్యాయం చేసిన వ్యక్తి జగన్మోహన్‌రెడ్డి అన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి ఎస్సీలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తుందని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధి కావాలంటే ప్రజలు మరోసారి తప్పు చేయకుండా తెలుగుదేశం పార్టీని ఆదరించాలన్నారు.

వరుసగా వలసలు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు బహిరంగ సభ, జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువగళం సభ కనిగిరిలో విజయవంతం కావడం టిడిపి శ్రేణుల్లో నూతన ఉత్సాహం నింపింది. చంద్రబాబు నాయుడు నియోజక వర్గానికి ఉగ్ర ప్రతిపాదించిన ఐదు గ్యారెంటీల హామీ ఇవ్వడంతో కనిగిరి నియోజకవర్గం శాశ్వతంగా అభివృద్ధి జరుగుతుందనే ప్రచారం నిర్వహిస్తూ ఉగ్ర తనదైన శైలిలో పావులు కదుపుతూ ముందుకు సాగుతున్నారు. దీంతో ఉగ్ర ఆధ్వర్యంలో వెలిగండ్ల మండలం నుంచి పిఎన్ వరం, గుమ్మళ్ల కర్ర, పందువ, పూలిగుంట్ల పంచాయతీల నుంచి 40 కుటుంబాలు, వెలిగండ్ల పంచాయతీ నుంచి 20 కుటుంబాలు, మరపగుంట్ల నుంచి 20 కుటుంబాలు, గన్నవరం నుంచి 13 కుటుంబాలు, రామగోపాలపురం పంచాయతీ నుంచి సర్పంచితోపాటు మరికొన్ని కుటుంబాలు టిడిపిలో చేరాయి. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, టిడిపి సీనియర్ నాయకులు దొడ్డ వెంకటసుబ్బారెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షుడు కేలం ఇంద్రభూపాల్‌రెడ్డి, మండల తెలుగు యువత అధ్యక్షుడు కర్నాటి భాస్కరరెడ్డి, మండల రైతు అధ్యక్షుడు మీనిగ కాశయ్య, మండల క్లస్టర్ ఇన్‌ఛార్జి కారంపూడి వెంకటేశ్వర్లు, అక్కి శ్రీనివాసరెడ్డి, అక్కి రాజేంద్ర, కేలం చంద్రశేఖర్‌రెడ్డి, దేవండ్ల మాధవ, కేసరి రమణారెడ్డి, తీట్ల చెన్నలక్ష్మి, తమ్మనేని పెద్దిరెడ్డి, మాజీ ఎంపిటిసి కర్నాటి వెంకటేశ్వర్‌రెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు ముత్యమాల మహేష్‌రెడ్డి, కొండ్రు విజయభాస్కర్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యులు షేక్ షరీఫ్, టి సుబ్రమణ్యం, కొండ్రు శ్రీనివాసరెడ్డి, పాతకోట వెంకటరెడ్డి, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.


వెలిగండ్ల మండలంలో వైసిపి నుంచి టిడిపిలోకి చేరిన 55 ఎస్సీ కుటుంబాలు

దళితులపై వైసిపి దాడులు: డాక్టర్ ఉగ్ర

కనిగిరి: దళితులపై దాడులు చేసి డోర్ డెలివరీ చేసే సంస్కృతిని వైసిపి ప్రభుత్వం తీసుకొచ్చిందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో పీసీ పల్లి మండలం పాత ముద్దపాడుకు చెందిన 15 దళిత కుటుంబాలు టిడిపిలో చేరాయి. డాక్టర్ ఉగ్ర మాట్లాడుతూ దళితులకు న్యాయం చేసింది, చేసేది ఒక్క తెలుగుదేశం పార్టీయేనని అన్నారు. నేడు రాష్ట్రంలో కోటి 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే వారిని 79 లక్షలకే కుదించారని అన్నారు. 35 లక్షల మందికి మొండిచేయి చూపించారన్నారు. పిన్నమ్మ తాళి తెంచిన నరహంతకులను రక్షిస్తున్న జగన్‌రెడ్డి మహిళా ద్రోహి కాదా? అని ప్రశ్నించారు. చెల్లికి ఆస్తిలో భాగం ఇవ్వని జగన్‌రెడ్డి ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడని విమర్శించారు.


కనిగిరిలో పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్న డాక్టర్ ఉగ్ర


ఎమ్మెల్యే నాగార్జునరెడ్డికి సమ్మె నోటీసు ఇస్తున్న డిఆర్‌డిఎ ఉద్యోగులు

సమ్మె నోటీసు అందజేత

ప్రజాశక్తి-మార్కాపురం: డిఆర్‌డిఎ సెర్ప్ సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మార్కాపురం ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డికి బుధవారం సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సెర్ప్ జెఎసి జిల్లా వైస్ చైర్మన్ వేల్పుల ఎజ్రా మాట్లాడుతూ మూడు సంవత్సరాల నుంచి సెర్ప్ ఉద్యోగుల సమస్యలను తీర్చకుండా ప్రభుత్వం దాటవేత ధోరణితో ఉందని అన్నారు. రాష్ట్ర జెఎసి యూనియన్ పిలుపు మేరకు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. సెర్ప్ సంస్థను ప్రభుత్వ సంస్థగా గుర్తించి కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేం దుకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం, తర్లుపాడు, పొదిలి, కొనకలమిట్ల ఏపిఎంలు రమేష్‌బాబు, దుగ్గెం పిచ్చయ్య, గోపాలకృష్ణారెడ్డి, మాణిక్యాలరావు, ఎలిస నాగభూషణం, సీసీలు, ఎమ్మెస్ సిసిలు పాల్గొన్నారు.


ఎంపిడిఒకి వినతిపత్రం అందజేస్తున్న డిఆర్‌డిఎ సిబ్బంది

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

ప్రజాశక్తి-కనిగిరి

డిఆర్‌డిఎ సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ కనిగిరి పట్టణంలో డిఆర్‌డిఎ ఉద్యోగులు నిరసన తెలియజేశారు. అనంతరం ఆర్డీవో, ఎంపిడిఒ కార్యాలయంలో సమస్యలతో కూడిన వినతి పత్రాలను అందజేశారు. డిఆర్‌డిఎ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఏపిఎంలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు ఎస్ఐకి సిఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు ఎస్ఐ ఏ సుబ్బరాజుకు సిఐగా పదోన్నతి లభించింది. గుంటూరు రేంజ్ పరిధిలో 35 మందికి పదోన్నతి లభించగా వారిలో కొమరోలు మండలం ఎస్ఐ కూడా ఉన్నారు. ఒక సంవత్సరం 3 నెలలుగా ఎస్ఐ సుబ్బరాజు కొమరోలు ఎస్ఐగా విధులు నిర్వహించారు. అనంతరం సిఐగా ఉద్యోగోన్నతి లభించింది. దీంతో సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు


సిఐగా ఉద్యోగోన్నతి పొందిన సుబ్బరాజు

దద్దాలను కలిసిన ముత్యాల

ప్రజాశక్తి-సిఎస్ పురం: వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి దద్దాల నారాయణ యాదవ్‌ను మండలంలోని అయ్యవారిపల్లి గ్రామ సర్పంచ్, వైసిపి నియోజకవర్గ నాయకులు ముత్యాల భారతి నారాయణరెడ్డి బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. మొదటిసారిగా కనిగిరి వచ్చిన దద్దాలను తమ గ్రామానికి చెందిన వైసిపి నాయకులను తీసుకెళ్లి ఆయనకు పరిచయం చేశారు. రానున్న ఎన్నికల్లో తమ గెలుపు కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని దద్దాల నారాయణకు తెలిపారు. ఆయన వెంట గ్రామానికి చెందిన రమణారెడ్డి, పలువురు వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాగుంట రాఘవరెడ్డికి ఘన సన్మానం

ప్రజాశక్తి-దొనకొండ: ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు, వైసిపి జిల్లా యువ నాయకుడు మాగుంట రాఘవరెడ్డి బుధవారం దొనకొండకు రాగా వైసిపి నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అనంతరం వైసిపి నాయకులు, మాగుంట అభిమానులను పరిచయం చేసుకుంటూ కొద్దిసేపు వారితో ముచ్చటించారు.

నేడు మున్సిపాలిటీల్లో నిరసన

యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



కె శ్రీనివాసరావు

రాష్ట్రవ్యాప్తగా మున్సిపల్ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి గురువారం తలపెట్టిన ధర్నాకు ఇచ్చిన అనుమతిని ప్రభుత్వం రద్దు చేయటంతో కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. గురువారం జరప తలపెట్టిన రాష్ట్రస్థాయి ధర్నా తాత్కాలికంగా వాయిదా వేశామన్నారు. ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరి నిరసిస్తూ గురువారం సాయంత్రం ఐదు గంటలకు అన్ని మున్సిపల్ కార్పొరేషన్లలో ఎక్కడికక్కడ నిరసన ప్రదర్శనలు జరపాలని రాష్ట్ర శాఖ నిర్ణయించిందన్నారు. ఈ నిరసనలు మున్సిపల్ ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొనాలని జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, జిల్లా కార్యదర్శి ఎం బాలరాజు , నగర శాఖ ప్రధాన కార్యదర్శి సిహెచ్ లక్ష్మీనారాయణ, అధ్యక్షులు జోష్ణ దేవి , గౌరవాధ్యక్షులు చావలి వెంకటరమణ కోరారు.



చక్రాయపాలెంలో బహుమతులు పంపిణీ

వ్యాసరచన పోటీలు

ప్రజాశక్తి - అద్దంకి

ఆడపిల్లల్లో సామాజిక అవగాహన పెంచి, విద్యా, వైద్య రంగాల్లో మరింత చురుగ్గా ఉండేందుకుగాను 2008నుండి జాతీయ బాలికా దినోత్సవం జరుపు కుంటున్నామని చక్రాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కెవి శ్రీనివాసరావు అన్నారు. చక్రాయపాలెం జెడ్‌పి ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని వంకాయలపాటి యశస్విని వ్యాస రచన పోటీలో జిల్లాస్థాయిలో తృతీయ స్థానం సాధించిందని తెలిపారు. వైద్య, ఆరోగ్య శాఖ జిల్లా అధికారిణి డాక్టర్ విజయమ్మ చేతుల మీదుగా రూ.2వేల నగదు బహుమతి అందించారు. కార్యక్రమంలో ఎస్‌కె షంశుద్దీన్, తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ జి పార్వతి, సర్పంచ్ నగేష్ పాల్గొన్నారు.



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ

సర్టిఫికెట్లు అందజేత

ప్రజాశక్తి - నాగులుప్పలపాడు

ఒంగోలు జనశిక్షణ సంస్థ సహకారంతో సామాజిక సేవ కార్యకర్త తెలగతోటి శామ్యూల్ ఆధ్వర్యంలో ఉప్పుగుండూరు గ్రామంలో ఇటీవల కాలంలో మహిళలకు 105రోజులు జాంగ్రపేట కుట్టుమిషన్ టైలరింగ్ ఉపాధ్యాయురాలు శివపార్వతి శిక్షణలో 20మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చారు. పూర్తి చేసుకున్న మహిళలకు బుధవారం సర్టిపికెట్లు పంపిణీ చేశారు. ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ మేనేజర్ కె ఝాన్సీరాణి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందినప్పుడే సమాజం నిజమైన అభివృద్ధి చెందినట్లు అవుతుందని అన్నారు. మహిళా అభివృద్ధికి శామ్యూల్ మాస్టారు చేస్తున్న కృషి అభినంద నీయమన్నారు. జనశిక్షణ సంస్థ డైరెక్టర్ కె శ్యామ్ సునీల్ చేతుల మీదుగా మహిళలకు సర్టిఫికెట్లు అందచేశారు. బ్యాంకు ఫీల్డ్ అసిస్టెంట్ కోట రమేష్, ఎస్‌కె అబ్దుల్ రహీమ్ పాల్గొన్నారు.

ఆడపిల్లలను చదవనిద్దాం

ప్రజాశక్తి - రేపల్లె

జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్ అధ్వర్యం లో గ్రామ బాలల రక్షణ కమిటీ, బాలల పంచాయతీ అధ్యక్షతన స్థానిక తుమ్మల, పోటుమేరక, పిరాట్లంక, చోడాయపాలెం, నల్లూరిపాలెం, కారుమూరు, పెనుమూడి, విశ్వశ్వరం గ్రామాల్లో గ్రామానికి 50మంది చొప్పున 400మందికి బాలికల సమస్యలు, వారి సామాజిక హక్కులు, విద్య, ఆరోగ్యం గురించి అవగాహనా కల్పించారు. చైల్డ్ రైట్స్ అడ్వకసి పౌండేషన్ ప్రోగ్రాం మేనేజర్ ఎన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి 1000మంది పురుషులకు స్త్రీలు 943మాత్రమే ఉన్నారని అన్నారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి తగ్గిపోతుందని అన్నారు. ఆ సంఖ్యను పెంచాలంటే మనం ఆడపిల్లను బ్రతకనిదాం, పుట్టనిదాం అని, గ్రామ స్థాయిలో ఎలాంటి సమస్యలు ఎదుర్కుంటున్నారో గమనించి వాటిని పరిష్కరిద్దామని చెప్పారు. చిన్న వయసులో వివాహం చేస్తున్నారని, దాని వల్ల ఆ ఆడపిల్లలు అనారోగ్య సమస్యలు ఎదుర్కుంటున్నారని అన్నారు. కాబట్టి బాల్య వివాహాలు చేయకుండా ఆపాలని చెప్పారు. ఎవరైనా బాల్య వివాహం చేస్తే రెండు సంసరాలు జైలు శిక్ష, రూ.లక్ష వరకు జరిమానా విధిస్తారని చెప్పారు. తుమ్మల నిర్మల నగర్ ప్రైమరీ పాఠశాల హెచ్‌ఎం నాంచారయ్య మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందున్నారని అన్నారు. వారిని చదివిస్తే మన గ్రామం, రాష్ట్రం, దేశం బాగుపడుతుందని అన్నారు. తన చిన్న వయసులో తన తల్లి ఎదుర్కొన సమస్యలు గురించి వివరించారు. జాతీయ బాలికల దినోత్సవం పోస్టర్‌ను గ్రామ పెద్దలు వెంకటేశ్వర్లు, జాలయ్య, ఏడుకొండలు, పాపమ్మ, మరియమ్మ, ప్రేమమ్, ప్రసాద్, పిరాట్లక పంచాయత్ సెక్రటరీ టి రత్న కిశోర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బాలికల



సంతమాగులూరులో బాలికా దినోత్సవం

తల్లి దండ్రులు, బాలికలు, పెద్దలు, అంగన్వాడీ వర్కర్స్, మహిళా సంరక్షణ కార్యదర్శులు, చైల్డ్ రైట్స్ ఆడ్వకసీ ఫౌండేషన్ మోనిటరింగ్ అండ్ ఎవల్యూషన్ కోఆర్డినేటర్ పి లక్మి ప్రసన్న, స్పాన్సర్ షిప్ ఆఫీసర్ బి నళిని, ఏఎస్ఓ సైనీ, క్లస్టర్ ఫీల్డ్ కోఆర్డినేటర్ రత్న ఏంజెల్ పాల్గొన్నారు.

సంతమాగులూరు : బాలికలు చదువులో బాలురతో సమానంగా పోటీ పడాలని ఎంఇఒ దినేష్ కుమార్ కోరారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో జాతీయ బాలికల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. బాలికల హక్కులు, విద్య, ఆరోగ్యం, పోషక ఆహారంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హై స్కూల్ హెచ్‌ఎం పి సుధారాణి, ఐసిడిఎస్ సూపర్ వైజర్లు సుష్మ, ప్రమీల పాల్గొన్నారు.

పర్చూరు : స్థానిక ఎస్ఎఫ్ఎస్ హై స్కూల్ నందు బాలికా దినోత్సవం నిర్వహించారు. సిడిపిఓ సుభద్ర, స్కూల్ ప్రిన్సిపల్ రెవరెండ్ ఫాదర్ తంబి జోసఫ్ మాట్లాడుతూ లింగ వివక్షత గురించి వివరించారు. బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని అన్నారు. ఆడపిల్లలకు 18ఏళ్ల నిండకుండా వివాహాలు చేసుకోకూడదని వివరించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు పి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు

దీప, దేవి, ఎం రాధా, ఎం అన్నపూర్ణ పాల్గొన్నారు. ఉప్పుటూరు హై స్కూల్ నందు జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ పి వసుంధర దేవి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

ఇంకొల్లు రూరల్ : బాలికల పట్ల అందరూ బాధ్యతగా వ్యవహరించాలని సిడిపిఓ టి ఝాన్సీ కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిడిఓ ఆర్‌వి రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

చీరాల : ఆడపిల్లల సాధికారతకు చదువే మూలమని ఏరియా ఆస్పత్రి వైద్యులు షణ్ముఖి, శిరీష అన్నారు. బాలికా సంరక్షణ దినోత్సవ సందర్భంగా పేరాల ఎఆర్‌ఎం ఉన్నత పాఠశాలలో బాలికలకు అవగాహన కల్పించారు. చదువుతోనే బాలికల ఉన్నతి సాధ్యమవుతుందని అన్నారు. ఆడ పిల్లల శ్రేయస్సు, ప్రాముఖ్యతను తెలిపేందుకు జనవరి 24న జాతీయ బాలికా దినోత్సవం జరుపుతున్నట్లు హెచ్‌ఎం బి సాల్మన్‌రాజు పేర్కొన్నారు. వ్యాస రచన, ప్రసంగ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ పవని భానుచంద్ర మూర్తి, ప్రసన్న కుమారి, సుశీల, వివి విజయలక్ష్మి తదితరలుఉ పాల్గొన్నారు.



పర్చూరులో మాట్లాడుతున్న సిడిపిఒ సుభద్ర



ఇంకొల్లు సభలో మాట్లాడుతున్న సిడిపిఒ ఝాన్సీ



చీరాలలో బహుమతులు అందజేస్తున్న హెచ్‌ఎం సాల్మన్‌రాజు



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సత్యప్రసాద్

రక్తదానం శిబిరం

ప్రజాశక్తి - రేపల్లె

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, టీడీపీ నేత పరిటాల రవీంద్ర 19వ వర్ధంతి సందర్భంగా మెగా రక్త దాన శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని ఎంఎల్ఎ అనగాని సత్య ప్రసాద్ అన్నారు. పరిటాల మరణించిన 19సంవత్సరాలైనా ఆయన ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచే ఉన్నారని పరిటాల యువసేన అధ్యక్షులు దండమూడి ధరణి కుమార్, అనగాని సత్య ప్రసాద్ అన్నారు. మండలంలోని నల్లూరుపాలెంలో పరిటాల రవీంద్ర విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 700మందికిపైగా రక్తదానం చేశారు. పరిటాల రవి సీమ నేలపై, బడుగు, బలహీన వర్గాల కోసం గర్జించారని అన్నారు. పీడిత ప్రజలకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలను అందించాలన్న తపనతో జీవితాన్ని ప్రజలకే అంకితం చేశారని అన్నారు. ఫ్యాక్షన్ నిర్మూలన కోసం రాజీ లేని పోరు సాగించారని అన్నారు. ఆ ఆశయ సాధనలోనే బలై పోయిన నేతని అన్నారు. ప్రజాసేవే ఊపిరిగా బతికిన అమరజీవి పరిటాల రవి అని అన్నారు. ఆయన చూపిన బాటలోనే తామంతా నడుస్తున్నామన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పని చేస్తున్నట్లు చెప్పారు. ఆయన చేపట్టిన కార్యక్రమాలను మరింత విస్తృతం చేస్తూ ముందుకెళ్తామన్నారు. గత 18ఏళ్లుగా పరిటాల యువసేన నాయకులు వివిధ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని అన్నారు. కరోన మహమ్మారి తీవ్రంగా ఉన్నప్పుడు ప్రజలకు పలు సేవలు అందించారని చెప్పారు. రక్త దానం చెయ్యంటం ప్రాణ దానంతో సమానమని అన్నారు. కార్యక్రమంలో నిజాంపట్నం ఎంపీపీ నర్రా సుబ్బయ్య, మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, అజయ్ పాల్గొన్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆక్వా కల్చర్ రాష్ట్ర వైస్ చైర్మన్ రఘురామ్ నాయుడు

ప్రజాశక్తి - టంగుటూరు



మాట్లాడుతున్న రఘురామ్ నాయుడు

రాష్ట్ర వ్యాప్తంగా ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కషి చేస్తామని ఆక్వా కల్చర్ డెవలప్మెంట్ అథారిటీ రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డీ రఘురామ్ నాయుడు పేర్కొన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఆక్వా రైతులతో బుధవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకునేందుకే తాను ఇక్కడికి వచ్చినట్లు చెప్పారు. సమస్యలను దాచి పెట్టకుండా స్పష్టంగా తనకు చెప్పాలని కోరారు. తద్వారా సమస్యల తీవ్రతను గుర్తించి పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. అనంతవరం గ్రామ ఆక్వా రైతులు పలువురు విద్యుత్తు బిల్లుల సమస్య అధికంగా ఉందని ఆయన దష్టికి తెచ్చారు. గతంలో మాదిరిగా హేచరీలకు సర్ చార్జీలను పూర్తిగా తొలగించి యూనిట్‌కు గతంలో మాదిరిగారూ రూ.1.50 ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. డీకే ల్యాండ్స్ భూముల్లో రా సాగు చేసుకుంటున్న రైతులకు లైసెన్సు ఇచ్చేలా చూడాలని రైతులు కోరారు. డీకే భూముల వివాదాలతో పాటు ఆక్వా రైతుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవ చూపాలని కోరారు. ఆక్వా రైతుల వినతులకు స్పందించిన రఘురామ్ నాయుడు మాట్లాడుతూ విద్యుత్ సర్ చార్జీల భారం కేవలం ఆక్వా రైతులకే కాదని, ఇది అందరికీ వర్తిస్తున్నందున దీనిపై తానేమీ మాట్లాడలేనని రైతుల వద్ద అంగీకరించారు. ఆక్వా, నాన్ ఆక్వా జోన్ రైతులందరికీ ఒకే విద్యుత్ చార్జీల విధానాన్ని ప్రవేశపెట్టేలా ఉన్నతాధికారులు, ప్రభుత్వంతో చర్చించి పరిష్కరించేందుకు కషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం ఆయనను ఆక్వా రైతులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఉప్పలపాటి శివరామరాజు, మత్స్య శాఖ జిల్లా సంయుక్త సంచాలకులు చంద్ర శేఖరరెడ్డి, ఎఫ్‌డిఓ ఎస్‌విఎస్ వర్షిణి, ఆక్వా కల్చర్ ఆల్ ఇండియా అసోసియేషన్ అధ్యక్షులు మోహన్ రాజు, రైతు సంఘం కన్వీనర్ దుగ్గినేని గోపీనాథ్, మున్నంగి రాజశేఖర్, ఎంపీటీసీ కసుకుర్తి కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు ఎవిఎస్ రాజు, వైసిపి గ్రామ కన్వీనర్ ఉప్పలపాటి సుబ్బరాజు, టంగుటూరు సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఆక్వా రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కార్మిక సంఘం నేతలు, కొండారెడ్డి

28న యుఇసిడబ్ల్యుయు రాష్ట్ర మహాసభలు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ 2వ రాష్ట్ర మహాసభలు నెల్లూరు లో ఈనెల 28న జరగనున్నాయని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఒంగోలు రీజియన్ అధ్యక్షుడు జివి.రాగయ్య కోరారు. స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో మహాసభలకు సంబంధించిన వాల్ పోస్టర్ బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాగయ్య మాట్లాడుతూ ఈ మహాసభలలో రాష్ట్రంలోని అన్నిరకాల కాంట్రాక్టు/ఔట్ సోర్సింగ్ కార్మికులు, మీటర్ రీడర్స్, మురా వర్కర్స్, ట్రాన్స్‌కోలో లేని బ్రేక్ డౌన్ కార్మికులు, వివిధ రకాల విద్యుత్ సబ్ స్టేషన్స్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై విస్తృత చర్చలు జరుగుతాయన్నారు. కొత్త నాయకత్వ ఎంపిక జరుగుతుందని, కార్మికుల దీర్ఘకాలిక సమస్య లపై మరింత సమరశీల పోరాటానికి ఈ మహాసభ నిర్ణయాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో యుఇసిడబ్ల్యుయు గౌరవాధ్యక్షుడు జివి.కొండారెడ్డి, ఎన్.గోపాల్, ఎం. హైగ్రీవరావు, కె.ప్రసాద్, మహేష్, ఎస్.సుబ్బారావు పాల్గొన్నారు.

అంతర పంటలు సాగు చేయాలి

ప్రజాశక్తి - పర్చూరు

సెనగలు కంచపంటగా, జొన్న, ఆవాలు, నువ్వులు, పొద్దు తిరుగుడు, చెట్టు చిక్కుడు అంతర్పంటలుగా సాగు చేయడం ద్వారా చీడ పీడల బారిన పడకుండా పంటను రక్షించుకోవచ్చని ఏపీ సీఎన్ఎఫ్ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ వాణిశ్రీ అన్నారు. జాగర్లమూడి, పోలూరు, యద్దనపూడి, గన్నవరం గ్రామాల్లో సెనగ పంటను బుధవారం పరిశీలించారు. జీవామృతం స్ప్రే చేయడం ద్వారా పంట బలంగా ఉండటంతో పాటు గింజ నాణ్యత పెరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డిపిఎం మోహన్ మాస్టర్, శిక్షకుడు అప్పారావు, యూనిట్ ఇన్చార్జి అనూష కోటి బాబు పాల్గొన్నారు.

వేమూరు : మండలంలోని చావలి రైతు భరోసా కేంద్రంలో రబీలో రైతులు సాగు చేసిన పంటల సస్యరక్షణ చర్యపై అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. గుంటూరు ఆత్మ సౌజన్యంతో జిల్లా వనరుల కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో బాపట్ల ఎడి ఆర్ విజయ బాబు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన మినుము, పెసర, మొక్కజొన్న, జొన్న పంటలపై సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు చేపట్టాలన్నారు. ఎడి సిహెచ్ సునీత మాట్లాడుతూ లేత దశలో ఉన్న మినుము, పెసర పైరును మందుల పిచికారీతో పాటు అవకాశం ఉన్న మేరకు ఆరు తడిని అందించితే అధిక దిగుబడులు వస్తాయని అన్నారు.

రాజ్యాంగంపై అవగాహన

ప్రజాశక్తి - చీరాల



పాల్గొన్న విద్యార్థినులు

సాంఘిక, ఆర్థిక, రాజకీయ, న్యాయాన్ని, ఆలోచనలను, భావ ప్రకటన, విశ్వాసం, నమ్మకం, ఆరాధన అన్నింటిలో ప్రజలందరికీ సమానంగా స్వేచ్ఛ ఇచ్చిన రాజ్యాంగం గురించి విద్యార్థినీ, విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని దళిత బహుజన రిసోర్స్ సెంటర్ డిబిఆర్‌సి కో-ఆర్డినేటర్ డాక్టర్ రమణమూర్తి అన్నారు. ఏరియా కో-ఆర్డినేటర్ వి భగవాన్ దాస్ అధ్యక్షతన మండలంలోని కెజిబివి నందు రాజ్యాంగ ప్రవేశిక ముఖ్యాంశాలపై ఫోటో ఎగ్జిబిషన్ బుధవారం నిర్వహించారు. రాజ్యాంగ విశిష్టతపై జరిగిన ఫోటో ఎగ్జిబిషన్‌ను విద్యార్థినీ, విద్యార్థులు తిలకించారు. కార్యక్రమంలో డిబిఆర్‌సి రీజనల్ కో-ఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడు జి పూర్ణయ్య, ప్రిన్సిపాల్ సుజాత, శారద, ప్రమీల, జ్యోతి, లత, సుశీల, శ్రీదేవి పాల్గొన్నారు.

బోగస్ ఓట్ల తొలగింపు పట్ల ఆమంచి హర్షం

ప్రజాశక్తి - కారంచేడు

పర్చూరు నియోజకవర్గంలో 13,558 బోగస్ ఓట్ల తొలగింపుపై వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్ హర్షం వ్యక్తం చేశారు. ఇంకా 10వేలకుపైగా దొంగ ఓట్లు ఉన్నాయని అన్నారు. వాటిని కూడ తొలగించే వరకు ఫిర్యాదులు చేస్తూనే ఉంటామని అన్నారు. ఆడుదాం ఆంధ్రా నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు చోట్ల ఓటు హక్కు వినియోగించే వారిపై చట్టపరంగా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎక్కడైతే సాధారణ నివాసం ఉంటారో అక్కడే ఓటు హక్కు ఉండాలని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ మిశ్రా తెలిపారని వివరించారు. ఇటీవల తెలంగాణ లో ఓటు వేసి ఇప్పుడు ఆంధ్రాలో ఓటు వేయటానికి వచ్చే వారిపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వెల్లడించారు. గతంలో ఎన్నికల సమయంలో ఓట్లు వేయటానికి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై నగరాల నుండి 400బస్సులు, 4వేల కార్లు వచ్చేవని తెలిపారు. ఇప్పుడు వాటిని నియంత్రించినట్లు తెలిపారు. అందరూ ఆడుతూ, పాడుతూ ఆరోగ్యంగా ఉండాలని సీఎం జగన్మోహన్ రెడ్డి ప్రారంభించిన ఆటల పోటీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయని అన్నారు. గ్రామీణ క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికి తీసేందుకు క్రీడలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. క్రీడల్లో ఎక్కువ మంది మహిళలు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ఆటల పోటీలను ఆయన తిలకించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, క్రికెట్ పోటీలు ఈనెల 29వరకు జరుగుతాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి నీరుకట్టు వాసు బాబు, అధికారులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



క్రీడా జ్యోతి వెలిగిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్

రిపబ్లిక్ డేను అంబేద్కర్‌డేగా నిర్వహించాలి

ప్రజాశక్తి - బాపట్ల

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రిపబ్లిక్ డే గా జరుపుతున్న గణతంత్ర దినోత్సవాన్ని అంబేద్కర్ డేగా జరపాలని అంబేద్కర్ యువజన సంఘం కన్వీనర్ గుదే రాజారావు డిమాండ్ చేశారు. ఆయన విలేకరులతో బుధవారం మాట్లాడారు. జనవరి 26 గణతంత్ర దినోత్స వంగా జరుపుతూ జనవరి 26న అంబేద్కర్ రాసిన రా జ్యాంగం అమలులోకి వచ్చిందనే విషయాన్ని ప్రజలకు చెప్పడం లేదన్నారు. 2016నుండి మోడీ ప్రభుత్వం రాజ్యాంగ ఆమోద దినోత్స వాన్ని జరపాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. రాజ్యాంగ అమలు దినోత్సవంగా కాకుండా గణతంత్ర దినోత్సవాన్ని రిపబ్లిక్ డే గా జరపటం అంబేద్కర్ పట్ల వివక్ష పాటించడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్వాతం త్ర్యానికి ముందు కనీస హక్కులు కూడా లేని భారత ప్రజల్ని మనుషులుగా గుర్తించేలా రాజ్యాంగం రాసిన అంబేద్కర్ పట్ల అగ్రకుల, మతోన్మాద పార్టీలకు గౌరవం లేదన్నారు. గాంధీ, నెహ్రూల జయంతులు, వర్ధంతులు జరిపే ప్రభుత్వం, రాజ్యాంగ అమలు జరపక పోవడం అంబేద్కర్‌ను వివక్ష గురి చేయడమేనన్నారు. ప్రపంచ దేశాల్లో కొన్ని చోట్ల రాజ్యాంగం కుప్పకూలి పోయిందని, అయితే అంబేద్కర్ రాసిన రాజ్యాంగమే అతిపెద్ద లిఖితపూర్వక రాజ్యాంగంగా నేటికీ విరాజిల్లు తుందన్నారు. బిఎస్‌పి ఇంచార్జ్ కొచ్చెర్ల వినయ్ రాజు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు పర్రె కోటయ్య పాల్గొన్నారు.



అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ రాజారావు

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

టోల్ ప్లాజా మేనేజర్ బొదిరెడ్డి పైడిరాజు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనదారులు అప్రమత్తంగా ఉండి గమ్య స్థానాలకు చేరుకోవాలని సింహపురి ఎక్స్ ప్రెస్ వే లిమిటెడ్ టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్ బొదిరెడ్డి పైడిరాజు అన్నారు. మండలంలోని బొల్లాపల్లి టోల్ ప్లాజా వద్ద 35వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలు టోల్ ప్లాజా సిబ్బంది బుధవారం నిర్వహించారు. రహదారి భద్రతా నియమ నిబంధనల గురించి వాహనదారులకు వివరించారు. మద్యం సేవించి అతివేగంగా వాహనాలు నడిపడటం వల్ల ఎన్నో ప్రమాదాలు జరుగు తున్నాయని అన్నారు. దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అన్నారు. విధుల్లో ఉన్న టోల్ ప్లాజా సిబ్బంది, పోలీస్ అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కోరారు. చిన్న అప్రమత్తతే నిండు ప్రాణాలను కాపాడుతుందని అన్నారు. దీనిని ప్రతి ఒక్కరు బాధ్యతగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో రూట్ ఆఫీసర్ బుక్కా గిరిబాబు, టోల్ మేనేజర్ త్రిలోక్ సింగ్, టోల్ ప్లాజా సిబ్బంది, చెక్ పోస్ట్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు పాల్గొన్నారు.



డ్రైవర్లకు ప్రమాదాల నివారణపై వివరిస్తున్న సిఐ, ఎస్ఎస్ఐలు

వైసిపిని వీడే వారి పరిస్థితి ఏంటి

ప్రజాశక్తి - బాపట్ల

వైసిపి సీటు నాదే. గెలిచేది నేనేనని ప్రచారం చేసుకుంటున్న ఎంఎల్ఎ కోన రఘుపతి వైసిపి వీడి వెళ తున్న నాయకుల్ని ఎందుకు తన దారిలోకి తెచ్చుకోవడం లేదని జనసేన ఇంచార్జి నామన వెంకట శివనారాయణ ప్రశ్నించారు. స్థానిక జనసేన కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ తరహాలో గతంలో ఏ ప్రజా నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకోలేదని అన్నారు. ఫ్లెక్సీలపై ఈ విధంగా వ్యాఖ్యలు రాసుకోవడం ఏమిటని ప్రశ్నించారు. సీటు నాదేనని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే రఘుపతి పేరు ఇప్పటివరకు వైసిపి కేంద్ర కార్యాలయం విడుదల చేసిన జాబితాల్లో పేరు ఎందుకు లేదని అన్నారు. టికెట్ అంత గ్యారెంటీ అయితే పదేపదే తాడేపల్లి ప్యాలెస్ వెళ్ళి సిఎం జగన్‌ను ఎందుకు కలుస్తున్నారన్నారో చెప్పాలన్నారు. ప్రజలు ఆశించిన స్థాయిలో అభివృద్ది జరగలేదని అన్నారు. వచ్చే ఎన్నికల్లో టిడిపి, జనసేన బలపరిచిన అభ్యర్థే ఎమ్మెల్యేగా గెలుస్తారని అన్నారు. సమావేశంలో జనసేన నాయకులు ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జనసేన ఇన్‌ఛార్జి శివన్నారాయణ



పరామర్శిస్తున్న వైసిపి ఇన్‌ఛార్జి పానెం హనిమిరెడ్డి

హరిప్రసాదరావుకు పరామర్శ

బల్లికురవ రూరల్ : మండలంలోని ఉప్పుమాగులూరు వైసిపి నాయకులు దేవినేని కృష్ణ తండ్రి దేవినేని హరిప్రసాదరావు బుధవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైసిపి ఇంఛార్జి పానెం చిన్న హనిమిరెడ్డి ఆయన ఇంటి వద్దకు వెళ్లి ప్రసాదరావు మృతదేహానికి నివాళులు అర్పించారు.



నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు

బాధిత కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి - వేమూరు : మండలంలోని జంపని గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు వేల్పుల చిన్న ప్రసాదరావు అనారోగ్యంతో మృతి చెందగా ఆయన మృత దేహానికి మాజీ మంత్రి నక్కా ఆనందబాబు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చావలి గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు విష్ణుమొలకల వెంకట రోశయ్య కుమారుడు పెద్దిరెడ్డియ్య (29) రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా అతని మృత దేహానికి నివాళులు అర్పించారు.



వరికూటి అశోక్‌బాబు ఇంటింటి ప్రచారం

అశోక్ బాబు విస్తృత పర్యటన

ప్రజాశక్తి - వేమూరు

వైసిపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు నియోజకవర్గంలో విస్తృతంగా బుధవారం పర్యటించారు. కాఫీ విత్ వై లీడర్స్ కార్యక్రమంలో భాగంగా కుచ్చేళ్ళ పాడు గ్రామానికి ఉదయం ఆరు గంటలకే వెళ్లి గ్రామస్తులతో కలిసి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పర్యటించి ప్రజలతో మమేకమై ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకున్నారు. కొల్లూరు మండలం తోకలవానిపాలెంలో గుండెపోటుతో మృతి చెందిన వాగోలు శ్రీనివాసరావు చిత్రపటానికి పూలమాల వేసిన అర్పించారు. చిలుమూరు లంక గ్రామంలో ప్రభుత్వం మంజూరు చేసిన సొసైటీ భూముల పట్టాలను లబ్ధిదారులకు అందజేశారు. మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున సారధ్యంలో సొసైటీ భూములకు పట్టాలు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో ఆడుదాం ఆంధ్ర నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలను ప్రారంభించారు. భట్టిప్రోలు మండలం సూరేపల్లి గ్రామంలో వైసిపి నాయకులు కర్ర నాగభూషణం కుమార్తె వివాహ వేడుకల్లో వధువును ఆశీర్వదించారు.

కార్మిక ద్రోహి సిఎం జగన్

ప్రజాశక్తి - పర్చూరు

కార్మికుల కడుపుకొట్టి ఉపాధి అవకాశాలను దెబ్బ తీసేతంగా పాలన సాగిస్తూ రాక్షసానందం పొందుతున్న సీఎం జగన్మోహన్‌రెడ్డి కార్మిక ద్రోహిగా మారారని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టముక్కల రఘురామ రాజు అన్నారు. టిఎన్‌టియుసి బస్సుయాత్రకు మార్టూరు టిడిపి కార్యాలయం వద్ద నాయకులు స్వాగతం పలికారు.



బాలినేనిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు

బాలినేనికి సత్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి వైసిపి నాయకులు బుధవారం సత్కరించారు. మూలగుంటపాడు గ్రామంలో ఓ కార్యక్రమానికి హాజరైన బాలినేని వైసిపి వైద్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి నివాసం వద్ద వైసిపి నాయకులు స్వాగతం పలికి గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో పిడిసిసి బ్యాంక్ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకుడు శీలం రాము, చుక్కా కిరణ్, కుమార్ చొప్పర వెంకన్న, రాపూరి ప్రభావతి, షేక్ కరీం, కుంచాల సాయి వేణు పాల్గొన్నారు.



బీరువా బహూకరిస్తున్న నూనె వెంకట సుబ్రహ్మణ్యం

పాఠశాలకు బీరువా బహూకరణ

ప్రజాశక్తి-చీమకుర్తి

మండల పరిధిలోని పాటిమీదపాలెం మండల పరిషత్ ప్రాధమిక పాఠశాలకు సుదర్శన్ గ్రానైట్ అధినేత నూనె వెంకట సుబ్రహ్మణ్యం బీరువాను బహూకరించారు. వెంకట సుబ్రహ్మణ్యం సతీమణి నూనె వెంకటలక్ష్మి సుజాత ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం బీరువా బహూకరించారు. అదేవిధంగా సంతనూతలపాడు వాసవీ క్లబ్‌కు గ్రైండర్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సుదర్శన గ్రానైట్ అధినేతలు నూనె వంశీకృష్ణ, రేష్మి దంపతులు, నూనె అనుదీప్ లక్ష్మిచైత్రపద్మిని దంపతులు, కొంకిమళ్ళ చంద్రమౌళి, హేమామాలిని దంపతులు, భూమా మహానందికుమార్, జాబిల్లి దంపతులు, పాఠశాల ప్రధానోపా ధ్యాయుడు ఎస్‌కె.శిలార్ ,ఉపాధ్యాయురాలు వాకా కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వారితో ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

టిడిపిలో చేరిక

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ మండలం శానంపూడి గ్రామంలో పలువురు బుధవారం టిడిపిలో చేరారు. కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి దామచర్ల సత్య వారికి కండువాలు కప్పి పార్టీలో ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో మద్దిపాని కోటేశ్వరరావు, మాదాల శ్రీకాంత్, మాదాల అశోక్, పందిటి హరిబాబు, మేక హరికష్ణ, మెట్టుపల్లి బ్రహ్మయ్య, నరసయ్య, బక్క బాలకష్ణ ,మల్లెల శ్రీను , శివ, జడి శ్రీను, తగరం బాలకోటయ్య, రావినూతల ఏడుకొండలు, కూతల నాగరాజు, పంబ మాలకొండయ్య, కోతల పెద్ద పిచ్చయ్య, కోతల శ్రీనివాసరావు, కొర్లపాటి చెన్నయ్య, కోతల యూసఫ్ బొమ్మల బ్రహ్మయ్య పంతగాని నాగరాజు చిరుతోటి బ్రహ్మయ్య, కోతల లక్ష్మయ్య ఉన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మించల బ్రహ్మయ్య, పులివర్తి లక్ష్మీనారాయణ, దగ్గుమాటి రామకష్ణ, కూనపు రెడ్డి సుబ్బారావు పాల్గొన్నారు.

క్రీడలతో క్రమశిక్షణ : మంత్రి

ప్రజాశక్తి-శింగరాయకొండ



క్రీడలను ప్రారంభిస్తున్న మంత్రి సురేష్

క్రీడలతో విద్యార్థుల్లో క్రమశిక్షణ ఏర్పడుతుందని మున్సిపల్ పట్టణాభివద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. శింగరాయకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని క్రీడా ప్రాంగణంలో కొండపి నియోజకవర్గ స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడలను బుధవారం ప్రారంభించారు. అనంతరం మంత్రి విద్యార్థులతో కలిసి కొద్దిసేపు క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి గ్రామాల్లోని సచివాలయం నుంచి రాష్ట్రస్థాయి వరకూ ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని యువకులు, విద్యార్థిని విద్యార్థులు క్రీడల పై ఆసక్తి చూపుతున్నట్లు తెలిపారు. సచివాలయాలు, మండల స్థాయి పోటీలు పూర్తయినట్లు తెలిపారు. ఇప్పుడు నియోజకవర్గ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నియోజక వర్గ స్థాయిలో గెలిచినవారు జిల్లా స్థాయికి, జిల్లా స్థాయిలో గెలిచిన వారు రాష్ట్రంలో ఆడనున్నట్లు ఆయన తెలిపారు. నాణ్యమైన ఆట సామగ్రి అందజేసి సిఎం జగన్ క్రీడలను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జగన్ విద్య, వైద్యం, వ్యవసాయంపై దష్టి సారించి చేస్తున్నట్లు తెలిపారు. నాడు-నేడు పథకం ద్వారా పాఠశాలు అభివృద్ధి చెందినట్లు తెలిపారు. ప్రజలకు మంచి వైద్యాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి క్రీడ స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. సూచించారు. క్రీడలతో మానసిక ఉల్లాసంగా ఉంటామన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల వల్ల వైసిపి, సిఎం జగన్ మోహన్ రెడ్డికి ఎలాంటి ఇబ్బంది లేదని వివరించారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి, జాయింట్ కలెక్టర్ నారద ముని, తహశీల్దారు ఉష, ఎంపిడిఒలు రమణమూర్తి, షేక్ జమీవులా, ఎంఇఒలు శివన్నారాయణ, ఆవుల శ్రీనివాసరావు, మూలగుంట పాడు సర్పంచి డాక్టర్ బత్తుల శివరామిరెడ్డి, వైసిపి వైద్యభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, యన్నాబత్తిన వెంకటేశ్వరరావు, వైసిపి యువజన విభాగం రాష్ట్ర నాయకుడు శీలం రాము, షేక్ కరీం, షేక్ మున్నా, యనమల మాధవి, రాపూరి ప్రభావతి, చుక్కా కిరణ్ కుమార్, చొప్పర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బాలికా హక్కుల పరిరక్షణకు కృషి : కలెక్టర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

బాలికా హక్కుల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ తెలిపారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయం వద్ద నుంచి నుంచి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు.కలెక్టర్ దినేష్ కుమార్ జెండా ఊపి ఈ ర్యాలీని ప్రారంభించారు. అనంతరం బాలికా హక్కులపై రూపొందించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. బాలికా హక్కులపై ప్రజలలో చైతన్యం రావాలన్నారు. ప్రజలకు వీటిపై అవగాహన కల్పించే లక్ష్యంతో ఈ ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. ఐసిడిఎస్, హెల్త్, గ్రామ వార్డు సచివాలయాల ద్వారా అన్ని గ్రామాల్లో బాల్య వివాహాల నివారణా, బాలికా విద్య అవసరం, బాలికల హక్కులపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గర్భస్త లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించకుండా గట్టి నిఘా ఏర్పాటు చేశామన్నారు.18 ఏళ్ళు నిండే వరకు ప్రతి ఆడపిల్ల చదువుకునేలా చర్యలు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సభ్యురాలు బత్తుల పద్మావతి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. మాధురి, మెప్మా పీడీ టి.రవికుమార్, బాల సంక్షేమ కమిటీ చైర్మన్ వి.రామాంజనేయులు, డిపిపిఒ దినేష్ కుమార్, డిఎల్‌పిఒ.పద్మ, సిడిపిఒ రాజకుమారి తదితరులు పాల్గొన్నారు.

వైసిపి వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్



మాట్లాడుతున్న దామచర్ల జనార్ధన్

వైసిపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్ళాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్‌రావు పార్టీ శ్రేణులకు దిశా నిర్ధేశం చేశారు. స్థానిక టిడిపి కార్యాలయం దామచర్ల అధ్యక్షతన ఒంగోలు నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దామచర్ల జనార్ధన్‌రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో టిడిపి ఆధ్వర్యంలో చేపట్టనున్న కార్యక్రమాలు, వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలోకి తీసుకెళ్లాలన్నారు. గత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో చేపట్టిన అభివద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారిని చైతన్యవంతులను చేయాలని కోరారు. టిడిపి నాయకులు, కార్యకర్తలపై జరిగే దాడులను ధీటుగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మంత్రి శ్రీనివాసరావు, కామేపల్లి శ్రీనివాసరావు, కొఠారి నాగేశ్వరావు, ద్వారా బాకుల శ్రీనివాసులరెడ్డి, నల్లమోతు బాలగంగాధర్, శ్రీరామమూర్తి, కొల్లిపల్లి సురేష్, కె. కుసుమకుమారి, కార్పొరేటర్లు దాచర్ల వెంకట రమణయ్య, సంద్రపాటి వర్ధ్వవర్త్, బండారు మదన్, పి. వెంకటేశ్వరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే స్వామి, దామచర్ల సత్య

'చీమకుర్తి'కి నివాళి

శింగరాయకొండ : టిడిపి సీనియర్ నాయకులు చీమకుర్తి వెంకటేశ్వర్లు ప్రథమ వర్ధంతిని శింగరాయకొండ మండలం మూలగుంటపాడులోని మలినేని పెరుమాళ్ళ ఐటిఐ కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొండపి ఎమ్మెల్యే డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి, టిడిపి రాష్ట్ర కార్యవర్గ కార్యదర్శి దామచర్ల సత్య వెంకటేశ్వర్లు పూలమాలు వేసే నివాళు లర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మందలపు గాంధీ చౌదరి, చిగురుపాటి శేషగిరి, మించల బ్రహ్మయ్య, నక్కా బ్రహ్మేశ్వరరావు , గడ్డం నరేంద్ర, కూనపు రెడ్డి సుబ్బారావు, సుదర్శి ప్రసాద్ రావు ఇమ్మడిశెట్టి రామారావు చీమకుర్తి శ్రీకాంత్, మన్యం సుబ్బారావు, పామర్తి సాయి, దక్షిణం శ్రీను, నక్కా శ్రీనివాసులు, భాస్కర్, చల్లా శ్రీను పాల్గొన్నారు. యునైటెడ్ ఫ్రెండ్స్ అసోసియేషన్, చీమకుర్తి వెంకటేశ్వర్లు అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 42 మంది రక్తదానం చేశారు.

ఒపిఎస్ సాధన సభను జయప్రదం చేయండి

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

సిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షను విధానం అమలు చేయాలని కోరుతూ ఈనెల 28న రాజమండ్రిలో నిర్వహిస్తున్న పాత పెన్షను సాధన సభలో ఉపాధ్యాయులు పాల్గొని జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒవి.వీరారెడ్డి, డి.వీరాంజనేయులు కోరారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నూతన పెన్షను విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు 2004 సెప్టెంబర్ నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమలైందన్నారు. అధికారంలోకి వచ్చిన వారంలో రోజుల్లో సిపిఎస్ విధానం రద్దుచేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తామన్న ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం నాలుగేళ్ళ తర్వాత 'గ్యారంటీడ్ పెన్షన్ విధానం' (జిపియస్) మరో కొత్త పెన్షన్ విధానం ముందుకు తెచ్చిందన్నారు. గత ప్రభుత్వం ప్రతిపాదించిన 50 శాతం పెన్షనుకు అదనంగా డిఎ కలిపిస్తామని చెబుతుందన్నారు. ఉద్యోగులు ఉపాధ్యాయులు కోరుకుంటున్న ఎలాంటి కాంట్రీబ్యూషన్ లేకుండా ప్రతి పిఆర్‌సిలో ఎంతో కొంత పెరుగుదలతో పాటు డిఎ, గ్రాడ్యుటీ, కమిటేషన్ ఉండే పాతపెన్షను విధానం కావాలన్నారు.